


నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న జీడీనెల్లూరు టీడీపీ అభ్యర్థి థామస్ - నగరిలో కాంగ్రెస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీ (ఇన్‌సెట్లో) నామినేషన్ వేసేందుకు ఎడ్ల బండిపై రాకేష్‌రెడ్డి

కొనసాగుతున్న నామినేషన్ల జోరు

పార్లమెంటుకు 4, అసెంబ్లీకి 20
117కు చేరిన సంఖ్య
రేపే చివరి రోజు

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 23 : జిల్లాలో నామినేషన్ల జోరు కొనసాగుతోంది. మొదటి నాలుగు రోజుల్లో 93 నామినేషన్లు అందగా మంగళవారం పార్లమెంటుకు 4, అసెంబ్లీ స్థానాలకు 20 అందాయి. దీంతో మంగళవారం నాటికి మొత్తం 117 అందాయి. ఈనెల 25తో నామినేషన్ల స్వీకరణ ముగియనుంది. చిత్తూరు పార్లమెంటు స్థానానికి కాంగ్రెస్ తరఫున ఎస్.జగపతి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియాకు ఆర్.భూలక్ష్మి, ఆలిండియా మహిళా ఎంపవర్మెంట్ తరఫున ఇ.రమేష్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎన్.జయకర్ నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు పుంగనూరు నుంచి బహుజన సమాజ్ పార్టీ తరఫున వి. సురేష్, నగరికి టీడీపీ తరఫున గాలి భానుప్రకాష్, కాంగ్రెస్ నుంచి పి.రాకేష్ రెడ్డి, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ఉప్పు రవికుమార్ ఒక్కో నామినేషన్ దాఖలు చేశారు. నీతి నిజాయితీ పార్టీ తరఫున అరవ చిట్టిబాబు రెండుసెట్ల నామినేషన్లు వేశారు. గంగాధరనెల్లూరుకు కాంగ్రెస్ తరఫున డి.రమేష్ బాబు, టీడీపీ నుంచి థామస్, సమాజ్ వాది పార్టీ తరఫున గుణశేఖర్, చిత్తూరు స్థానానికి వైసీపీ నుంచి ఎంసీ విజయానందరెడ్డి, పూతలపట్టుకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎంవీ విజయభాస్కర్, విడుదలై చిరుతైగళ్ పార్టీ నుంచి కె.సంతోష్‌కుమార్, పలమనేరుకు వైసీపీ నుంచి ఎన్.పావని, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఆర్.శోభ, ఇండిపెండెంట్‌గా ఎ.సుబ్రహ్మణ్యం నామినేషన్ వేశారు. కుప్పం అసెంబ్లీ నియోజకవర్గానికి వైసీపీ అభ్యర్థి భరత్ రెండు సెట్ల నామినేషన్ దాఖలు చేయగా, బహుజన సమాజ్ పార్టీ నుంచి గణేష్, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా నీలమ్మ, ఎన్. నాగరాజు రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్లు అందజేశారు. బుధ, గురువారాల్లో ఎక్కువ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశముంది.

పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో గందరగోళం

● జిల్లా సరిహద్దు మండలాల్లో సమస్యలు
● పుంగనూరు, పుత్తూరుల్లో ఆఫీసుల చుట్టూ టీచర్ల ప్రదక్షిణలు


చిత్తూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి. వీరు పోలింగ్ విధుల్లో పాల్గొంటున్నందున పోస్టల్ బ్యాలెట్ విధానం ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే అవకాశముంది. ఈ ఓట్లలో సింహభాగం ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉంటాయనే భావనతో వైసీపీ అనుకూల అధికారులు గందరగోళం సృష్టిస్తున్నారు.సాంకేతిక లోపాలు చూపించి సంబంధిత దరఖాస్తులను చెల్లకుండా చేసేందుకు సహకరిస్తున్నారు. ముఖ్యంగా పోస్టల్ బ్యాలెట్ కోసం ఫాం 12 దరఖాస్తు సమర్పణ గురించి చిత్తూరు కలెక్టర్ షన్మోహన్ అన్ని శాఖల ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు టీచర్లు ఎక్కడున్నప్పటికీ పనిచేస్తున్న మండలంలో దరఖాస్తులు సేకరించి పంపేలా ఎంఈవోలకు ఆదేశాలు అందాయి. అయితే, అంతకుముందే ఈ విషయానికి సంబంధించి భిన్నమైన సూచనలు రావడంతో పలువురు టీచర్లు తమకు ఓటు హక్కున్న నియోజకవర్గ ఆర్వో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించారు. రామసముద్రం మండలంలో పనిచేస్తూ పుంగనూరులో ఓటు హక్కున్న టీచర్లు పెద్ద సంఖ్యలో పుంగనూరు ఆర్వో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించారు. వీటిని అనుమతించడంలో పలు ఇబ్బందులు ఎదురయ్యాయి. నగరి చిత్తూరు జిల్లాలో ఉన్నప్పటికీ పుత్తూరు మండలం తిరుపతి జిల్లాలో ఉంది. దీంతో వివిధ మండలాల్లో పనిచేస్తున్నప్పటికీ పుత్తూరులో ఓటు హక్కు కలిగిన టీచర్లు పుత్తూరు ఎంఈవో కార్యాలయానికి తమ దరఖాస్తుల్ని సమర్పించారు. వీటిలో నగరి నియోజకవర్గానికి సంబంధించినవి 279 ఉండగా, ఇతర నియోజకవర్గాలకు సంబంధించినవి 53.. మొత్తంగా 332 దరఖాస్తులను విద్యాశాఖ సిబ్బంది తీసుకున్నారు. వీటిని నియోజకవర్గాల వారీగా విభజించి మంగళవారం మధ్యాహ్నం నగరి ఆర్వో కార్యాలయంలో సమర్పించడానికి వెళ్లగా వారు తిరస్కరించారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం పనిచేస్తున్న మండలాల్లో సమర్పించాల్సిందేనని స్పష్టం చేశారు. వందల సంఖ్యలో ఓట్లు ఉన్నందున చిత్తూరు కలెక్టర్‌తో చర్చించి పరిష్కారం చూపాలని కోరినప్పటికీ నగరి ఆర్వో వెంకటరెడ్డి పట్టించుకోలేదు. దీంతో విద్యాశాఖ సిబ్బంది దరఖాస్తులను తీసుకుని రాత్రి 8 గంటల ప్రాంతంలో చిత్తూరు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సమయం మించిపోవడంతో అక్కడున్న సిబ్బంది బుధవారం ఉదయం రావాలని తెలిపారు. ఒకవైపు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు 26 వరకు పెంచినట్లు రాష్ట్ర ఎన్నికల అధికారి చెప్తుండగా, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు ఎదురవుతుండడం పట్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

టార్గెట్ టీడీపీ

● వైసీపీ అధికారంలోకి వచ్చాక నేతలపై పెద్దఎత్తున అక్రమ కేసులు

● చంద్రబాబు, అమరనాథరెడ్డిపై 22 చొప్పున
● చల్లా బాబుపై 17, గాలి భానుపై 15

'నాకు దక్కనిది ఇంకెవ్వరికీ దక్కనివ్వను' అని మగధీర సినిమాలో విలన్ అనే డైలాగ్ అప్పట్లో బాగా పాపులర్ అయింది. 'నా మీద కేసులెక్కువ ఉన్నాయి. మిగిలినవారి మీదా పెడుతాను' అంటున్న సీఎం జగన్ తీరు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి



తాను జైల్లో ఉన్నానని, తన మీద ఎన్నో అవినీతి కేసులున్నాయని భావించిన సీఎం జగన్ ప్రత్యర్థుల మీద కక్ష పెంచుకున్నారు. ప్రత్యర్థి, టీడీపీ అధినేత చంద్రబాబు మీద ఈ ఐదేళ్లలో పెద్దఎత్తున అక్రమ కేసులు పెట్టారు. జైల్లో కూడా ఉంచారు. అలాగే జిల్లాలోని టీడీపీ నేతల మీద పెద్దఎత్తున అక్రమ కేసులు నమోదు చేసి వైసీపీ నేతలు ఆనందం పొందారు. టీడీపీ అభ్యర్థులు వేసిన నామినేషన్లలోని అఫిడవిట్లను పరిశీలిస్తే వైసీపీ అధికారంలోకి వచ్చాక నమోదు చేసిన కేసుల వివరాల గురించి తెలుస్తుంది. కుప్పం నుంచి పోటీ చేస్తున్న చంద్రబాబు మీద మొత్తం 24 కేసులుంటే అందులో 22 వైసీపీ పెట్టినవే. అలాగే పలమనేరు నుంచి బరిలో ఉన్న అమరనాథరెడ్డి మీద 24 కేసులుండగా, వాటిలో 22 కేసులు 2019 తర్వాత నమోదైనవే. ఇక పెద్దిరెడ్డి అక్రమాల మీద పోరాడిన చల్లా రామచంద్రారెడ్డి మీద ఏకంగా 17 కేసులను వైసీపీ నమోదు చేసింది. నగరి నుంచి పోటీ చేస్తున్న గాలి భానుప్రకాష్ మీద కూడా 15 కేసులు ప్రభుత్వం నమోదు చేసింది.

● చంద్రబాబుపై హత్యాయత్నం కేసులు

చంద్రబాబుపై 24 కేసులున్నాయి. 2010లో చంద్రబాబు మహారాష్ట్రలోని బాబ్లి ప్రాజెక్టును సందర్శించడానికి వెళితే అక్రమంగా ప్రవేశించారని ధర్మాబాద్ పోలీసులు కేసు పెట్టారు. 2012లో ఆళ్లగడ్డ ఉప ఎన్నిక సమయంలో కోడ్ ఉల్లంఘించారని కేసు నమోదైంది. మిగిలిన 22 కేసులూ వైసీపీ ఈ ఐదేళ్లలో పెట్టింది. 2020లో 5, 2021లో 9, 2022లో 2, 2023లో 6 కేసులు పెట్టారు. మంగళగిరిలో సీఐడీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 8 కేసులున్నాయి. 2023లో 2, 2022లో 1, 2021లో 3, 2020లో 2 కేసుల్ని సీఐడీ పోలీసులు నమోదు చేశారు. అన్నమయ్య జిల్లా ముదివేడు, విజయనగరం జిల్లా నెల్లిమర్ల స్టేషన్లలో హత్యాయత్నం కేసులున్నాయి. ముదివేడు స్టేషన్ పరిధిలో టీడీపీ శ్రేణులను వైసీపీ కార్యకర్తలపై చంద్రబాబు రెచ్చగొట్టి పంపించారని హత్యాయత్నం కేసు నమోదు చేశా రు. రోడ్‌షో సందర్భంగా అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి మీద అనుచిత వ్యాఖ్యలు చేశారని ములకలచెరువు స్టేషన్‌లో కేసు పెట్టారు.

● కొవిడ్ వ్యాక్సిన్లు లేవన్నందుకూ కేసులు

కొవిడ్ రెండో వేవ్ సమయంలో చంద్రబాబు 440కే వేరియెంట్ గురించి మాట్లాడి ప్రజల్లో భయాందోళన కలిగించారని గుంటూరు టౌన్ అరండల్‌పేట, పల్నాడు జిల్లా నరసరావుపేట 2 టౌన్, కర్నూలు 1 టౌన్‌లో ఒక్కోటి చొప్పున మూడు కేసులు నమోదు చేశారు. కొవిడ్ వ్యాక్సిన్లు అందుబాటులో లేవని చెప్పినందుకు విజయవాడ నగరంలోని సూర్యాపేట స్టేషన్‌లో ఓ కేసు పెట్టారు.

● అమర్‌పై 15 స్టేషన్లలో 22 కేసులు

జిల్లా టీడీపీలో కీలక నేత, మాజీ మంత్రి అమరనాథరెడ్డి మీద 2020 నుంచి 22 కేసులు నమోదయ్యాయి. నారా లోకేశ్ జిల్లాలో యువగళం పాదయాత్ర ప్రారంభించగా పోలీసులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. జిల్లావ్యాప్తంగా అన్ని స్టేషన్లలో కేసులు పెట్టారు. లోకేశ్ వెంట నడిచిన అమర్ మీద కూడా కేసులు పెట్టారు. అలాగే ముదివేడు, ములకలచెరువు ప్రాంతాల్లో చంద్రబాబుతోపాటు ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గతేడాది అక్కడ ఘర్షణలు జరిగిన విషయం తెలిసిందే. చంద్రబాబుతోపాటు ఆయన మీదా కేసులు పెట్టారు. చంద్రబాబు కుప్పం వచ్చినప్పుడు జరిగిన కార్యక్రమాల్లోనూ అమర్‌ను కేసుల్లో చేర్చారు. ఇలా అన్నమయ్య జిల్లా ముదివేడు స్టేషన్‌లో 2, ములకలచెరువులో 1, చిత్తూరు జిల్లాలోని పలమనేరులో 4, వి.కోటలో 2, బంగారుపాళ్యం, ఎస్ఆర్‌పేట, పూతలపట్టు, బైరెడ్డిపల్లె, చిత్తూరు 2 టౌన్, గుడుపల్లె, కుప్పం అర్బన్, రాళ్లబుదుగూరు, చిత్తూరు 1 టౌన్ స్టేషన్లలో ఒక్కోటి చొప్పున.. తిరుపతి జిల్లాలోని తిరుచానూరులో 2, అలిపిరిలో 1 మొత్తం 22 కేసులు నమోదయ్యాయి.

● పుంగనూరులోనే అత్యధిక కేసులు

పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలను అడ్డుకుంటూ చల్లా రామచంద్రారెడ్డి ఏళ్లుగా పోరాడుతున్నారు. పుంగనూరు నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణుల మీద పెట్టిన అక్రమ కేసులు, తెరిచిన రౌడీషీట్లు రాష్ట్రంలో మరే నియోజకవర్గంలోనూ ఉండకపోవచ్చు. టీడీపీలో యాక్టివ్‌గా ఉండే ప్రతి నాయకుడు, కార్యకర్త మీద కేసులు పెట్టారు. టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి మీద వైసీపీ వచ్చాక ఏకంగా 17 కేసులు పెట్టారు. గతేడాది ఆగస్టులో పుంగనూరులోకి చంద్రబాబు రాకను వైసీపీ శ్రేణులు అడ్డుకోవడం.. పోలీసులకు, టీడీపీ శ్రేణులకు మధ్య ఘర్షణ చోటు చేసుకోవడం తెలిసిందే. ఆ ఘటనలో ఏకంగా 598 మంది మీద కేసులు పెట్టారు. చల్లా కూడా కొన్నాళ్లపాటు అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. ఆ తర్వాత నేరుగా లొంగిపోయి జైలుకు కూడా వెళ్లి వచ్చారు. ఈయన మీద పుంగనూరులో 8 కేసులు, రొంపిచెర్లలో 4, సోమల, కల్లూరు, చౌడేపల్లె, ముదివేడు, ములకలచెరువులో ఒక్కోటి చొప్పున మొత్తం 17 కేసులు నమోదయ్యాయి. 2023 అత్యధికంగా 8 కేసులు పెట్టారు.

● గాలి భానుపైనా 15 కేసులు

నగరి నుంచి రెండోసారి బరిలో నిలిచిన గాలి భానుప్రకాష్ మీద కూడా వైసీపీ ప్రభుత్వం అక్రమ కేసులు నమోదు చేసింది. ఈయన మీద ఈ ఐదేళ్లలో 15 కేసులు నమోదయ్యాయి. 2019లో అత్యధికంగా 8 కేసులు, 2023లో 4, 2021లో 2, 2022లో ఓ కేసు పెట్టారు. అన్నీ నగరి, పుత్తూరు, నిండ్ర, విజయపురం, రేణిగుంట, తిరుచానూరు స్టేషన్లలో ఉన్నాయి.

కాణిపాకంలో చిత్రా పౌర్ణమి వేడుకలు



ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 23: కాణిపాకంలో చిత్రా పౌర్ణమి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రధాన ఆలయంలో మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించారు. స్వామిని సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ పుష్కరిణి వద్ద హారతులు ఇచ్చారు. వేడుకలను తిలకించడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం విచ్చేశారు. అనంతరం సిద్ధిబుద్ధిసమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను కాణిపాకం పురవీధులలో అంగరంగ వైభవంగా ఊరేగించారు. ఐరాలకు చెందిన దివంగత రామకృష్ణపిళ్లై కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండపాణి, ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి సెలవులు

● జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం



చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 23: 2023-24 విద్యా సంవత్సరం మంగళవారంతో ముగిసింది. చివరి రోజున ప్రోగ్రెస్ రిపోర్టులు, ప్రమోషన్ కార్డులను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. బుధవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు విద్యాశాఖ పాఠశాలలకు వేసవి సెలవులు ప్రకటించింది. జూన్ 12న పునఃప్రారంభం కానున్నాయి. కాగా, టెన్త్ ఫలితాల నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ఫెయిలైన విద్యార్థులకు సబ్జెక్టు టీచర్లతో రెమిడియల్ తరగతులు నిర్వహించనున్నారు.

సీఐ గంగిరెడ్డిపై ఎట్టకేలకు వేటు

● పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని సీఈసీ ఆదేశం
● టీడీపీ నాయకుల ఫిర్యాదుతో స్పందించిన సీఈసీ

చిత్తూరు, ఏప్రిల్ 23: వైసీపీకి అనుకూలంగా ఉంటూ మంత్రి పెద్దిరెడ్డి మనిషిగా ముద్రపడిన సీఐ గంగిరెడ్డి మీద ఎట్టకేలకు వేటు పడింది. జిల్లా ఎన్నికల విభాగంలో పనిచేస్తున్న ఆయన్ను కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం బదిలీ చేసింది. వెంటనే పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించింది. పుంగనూరు సీఐగా సుదీర్ఘకాలం పనిచేసిన గంగిరెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్షంగా వ్యవహరించారని, నామినేషన్లు వేసిన ప్రతిపక్ష అభ్యర్థులను బెదిరించి విత్‌డ్రా చేయించారని ఆరోపణలు ఉన్నాయి. అయన సమక్షంలోనే వైసీపీ నేతలు నామినేషన్లను చించేసిన ఘటనలున్నాయి. ఈ క్రమంలో అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆయన్ను ఎన్నికల విధుల నుంచి తప్పించి, బదిలీ చేసింది. పెద్దిరెడ్డి అండతో మళ్లీ అయన పుంగనూరుకే వచ్చారు. జిల్లాలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్నా ఎన్నికల నేపథ్యంలో ఆయన జిల్లా వదలిపోలేదు. లూప్‌లైన్ పేరుతో ఎస్పీకి దగ్గరగా ఉండే స్పెషల్ బ్రాంచ్ విభాగంలో కూర్చున్నారు. ఈ విభాగంలో ఉన్న తనకంటే పైస్థాయి అధికారికి తెలియకుండా 14 మంది అనుకూల సిబ్బందితో స్పెషల్ టీమ్‌ను సిద్ధం చేసుకున్నారు. గంగిరెడ్డితో పొసగక పై స్థాయి అధికారి అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో స్పెషల్ బ్రాంచ్ విభాగానికి గంగిరెడ్డి చీఫ్‌గా మారి ఏకపక్షంగా పనిచేయాలంటూ జిల్లాలోని పోలీసు అధికారులకు హుకుం జారీ చేసినట్లు ఆరోపణలున్నాయి. కొత్తగా వచ్చిన ఎస్పీ మణికంఠ చందోలు గంగిరెడ్డి అంశాన్ని పరిశీలించి స్పెషల్ బ్రాంచ్ నుంచి ఎన్నికల విభాగానికి బదిలీ చేశారు. ఎన్నికల సమయంలో గంగిరెడ్డి ఇలా లూప్‌లైన్ పేరుతో జిల్లాలోనే కొనసాగితే ఇబ్బంది అవుతుందని, గతంలో ఆయన వ్యవహరించిన తీరును ఉదహరిస్తూ టీడీపీ నేతలు ఎన్నికల సంఘానికి వరుస ఫిర్యాదులు చేశారు. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం గంగిరెడ్డికి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలిచ్చింది.

ముద్దనపల్లె, బిరుగుండ్లపల్లెల్లో ఏనుగుల హల్‌చల్

రామకుప్పం, ఏప్రిల్ 23: మండలంలోని అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు ఏనుగుల దాడులతో గజగజలాడుతున్నారు. ఆదివారం రాత్రి నాలుగు ఏనుగులు ఎస్.గొల్లపల్లె గ్రామ సమీప పొలాల్లో స్వైరవిహారం చేశాయి. తాజాగా మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో ముద్దనపల్లె-బిరుగుండ్లపల్లె గ్రామాల మధ్య పొలాల్లో మూడు ఏనుగులు తిష్ట వేసి, పంటలను ధ్వంసం చేశాయి. సమాచారం అందుకున్న అటవీ అధికారులతోపాటు గ్రామస్తులు టపాకాయలు పేల్చుతూ వాటిని అడవిలోకి తరిమే ప్రయత్నం చేశారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పొలాల్లో తిష్ట వేసిన ఏనుగులు

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ విడుదల

చిత్తూరు(సెంట్రల్)ఏప్రిల్23: మే 24వతేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయి. విద్యాశాఖ జారీ చేసిన షెడ్యూల్ మంగళవారం డీఈవో కార్యాలయానికి చేరింది.ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. మే 24న తెలుగు, 25న హిందీ, 27న ఇంగ్లిషు, 28న మ్యాథ్స్, 29న ఫిజికల్ సైన్స్, 30న బయోలజికల్ సైన్స్, 31న సోషల్ స్టడీస్, జూన్ 1, 3 తేదీల్లో ఆప్షనల్ పేపర్ల పరీక్షలు జరుగనున్నాయి.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పలమనేరులో మూడు నామినేషన్లు

పలమనేరు, ఏప్రిల్23 : పలమనేరులో మంగళవారం మరో మూడు నామినేషన్లు వచ్చాయని ఆర్డీఓ మనోజ్ రెడ్డి తెలిపారు. పలమనేరు నియోజకవర్గం నుంచి శాశనసభకు పోటీచేసేందుకు పుంగనూరు మండలం పెద్ద అలసాపురం గ్రామానికి చెందిన అలసాపుర సుబ్రమణ్యం స్వతంత్ర అభ్యర్థిగా, వి.కోట హరిజనవాడకు చెందిన ఆర్.శోభ బీఎస్పీ అభ్యర్థిగా, వి.కోట మండలం తోటకనుమ గ్రామానికి చెందిన ఎమ్మెల్యే వెంకటేగౌడ సతీమణి ఎస్.పావని వైసీపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. దీంతో మొత్తం 18 నామినేషన్లు వచ్చాయని ఎన్నికల అధికారి వివరించారు.

శాస్త్రోక్తంగా చండీహోమం

చౌడేపల్లె, ఏప్రిల్23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో చండీహోమాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. మంగళవారం పౌర్ణమి సందర్భంగ ఆశీర్వద మండపంలో కలశస్థాపన చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలమంత్రాన్ని భక్తులచే పఠింపజేసి సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం చండీహోమాన్ని భక్తులచే ఆచరింపజేశారు. అధిక సంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాధితులను పరామర్శించిన భువనేశ్వరి


మొబైల్ ద్వారా భువనేశ్వరితో మాట్లాడిస్తున్న ఎమ్మెల్సీ

కుప్పం, ఏప్రిల్ 23: కుప్పం పురపాలక సంఘం పరిధిలోని తంబిగాని పల్లెలో సోమ వారం జరిగిన ఘర్షణలో గాయ పడిన బాధితుల కుటుంబాలను మంగళవారం నారా భువనేశ్వరి పరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ బాధిత కుటుంబాలలోని మహిళ లను మంగళవారం కలిశారు. ఆయన ద్వారా ఫోన్లో వీడియో కాల్‌లో వారిని భువనేశ్వరి పరామర్శించారు. వైసీపీ గూండలు తమ గ్రామంపై పడి శరవణ, మణితోపాటు వారి స్నేహితులపై విచక్షణా రహితంగా దాడి చేశారని బాధిత మహిళలు ఆమె ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఇళ్లలోకి చొరబడి మహిళల చీరలు పట్టి లాగారని ఆవేదన వ్యక్తం చేశారు. భువనేశ్వరి మాట్లాడుతూ అండగా తానూ వస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ న్యాయం జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటారని భరోసా ఇచ్చారు.

ఓట్లకోసమే వన్యాస్‌ను భరత్ వాడుకుంటున్నారు


విలేకరులతో మాట్లాడుతున్న వెంకటేశ్

కుప్పం, ఏప్రిల్ 23: వన్నెకుల క్షత్రియ కులం పేరు చెప్పుకుని వైసీపీ ఎమ్మెల్సీ భరత్ ఆ కులం వారిని ఓట్ల కోసం వాడుకుంటున్నారని తెలుగుదేశం పార్టీకి చెందిన వన్నెకుల క్షత్రియ నాయకుడు కాణిపాకం వెంకటేశ్ విమర్శించారు. కుప్పం పురపాలక సంఘం తంబిగానిపల్లెకు చెందిన వెంకటేశ్, ఆ గ్రామానికి చెందిన ఇంకొందరు వన్నెకుల క్షత్రియ నాయకులతో కలసి మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతంలో ఒక ఆటో డ్రైవర్‌కు, తంబిగానిపల్లెకు చెందిన యువకుడికి మధ్య ఘర్షణ జరిగిందన్నారు. అక్కడికక్కడే వారిద్దరూ సర్దుకున్నారని చెప్పారు. అయితే తర్వాత కొత్తపేటకు చెందిన వ్యక్తులు తంబిగానిపల్లెకు వచ్చి కొందరిపై దాడి చేశారని తెలిపారు. కొత్తపేటకు, తంబిగానిపల్లె గ్రామానికి మధ్య సోదర సంబంధాలు ఎప్పటినుంచో ఉన్నాయన్నారు. ఇంతపెద్ద దాడి జరిగినా వైసీపీ ఎమ్మెల్సీ భరత్, బాధితులను కనీసం పరామర్శించకపోవడం దారుణమని ఆయన విమర్శించారు.

రథోత్సవంపై ఊరేగిన రాళ్లగంగమాంబ

గుడుపల్లె, ఏప్రిల్ 23: రాళ్లగంగమాంబ రథోత్సవం మంగళవారం ఘనంగా సాగింది. మండల కేంద్రంలో నెలకొన్న ప్రసన్న రాళ్లగంగమాంబ వార్షిక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవలో మేల్కొలిపి వేదపండితులు నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అమ్మవారిని రంగురంగు పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం గంగమాంబ ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, అభరణాలు, పూలహారాలతో అలంకరించి రథంపై అధిష్ఠింజేశారు. ఆ తరువాత మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ గంగమ్మ నామస్మరణతో రథోత్సవం ఆలయ వీధుల్లో సాగింది. మహిళలు అమ్మ వారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాన్ని చూసేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం


కథల పుస్తకాలు అందుకున్న విద్యార్థులు

గంగవరం, ఏప్రిల్ 23 : ఒక మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమాన మని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు తులసీ నాథంనాయుడు పేర్కొన్నారు. మంగళవారం గంగవరంలోని కళామందిరంలో 'పుస్తకమే నిజమైన స్నేహం 'అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి విలువలతో కూడిన పుస్తకం చదవడం వలన వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి కథల పుస్తకాలను చదివించడం అలవాటు చేయాలన్నారు. విద్యార్థుల కోసం ఇప్పటివరకు ఒక లక్షా 50వేల పుస్తకాలను పంచి పెట్టామని తెలియజేశారు. ఈ సదస్సుకు హాజరైన విద్యార్థులకు సంస్థ కార్యదర్శి పుష్ప పలు కథల పుస్తకాలను అందించారు.

మహిళ అదృశ్యం


మంజుల

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 23: ఇంటి నుంచి వెళ్లిన మహిళ ఆదృశ్య మైంది. ఆమె తల్లి అదెమ్మ కథనం మేరకు.. మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ వెంకటాద్రికాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం, అదేకాలనీకి చెందిన మంజుల(26) దంపతులు. వీరికి ఒక కుమార్తె ఉంది. సుబ్రహ్మణ్యం మేస్త్రీ. శనివారం దంపతుల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో మంజుల ఇంటినుంచి వెళ్లిపోయింది. పలుచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరుడి రథోత్సవం



రామకుప్పం, ఏప్రిల్ 23: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం ఉభయదారులు సజ్జల చెంగారెడ్డి కుటుంబీకుల ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేశారు. ఉయదం 8గంటలకు ఆలయ నిర్వాహకులు రథాన్ని శుభ్రం చేసి వస్త్రాలు, పుష్పాలు, అరటిచెట్లు, మామిడి తోరణాలతో అలంకరించారు. 10 గంటలకు వేదపండితులు రథానికి పూజలు చేశారు. వివిధ రకాలు హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు స్థానిక బ్రాహ్మణులు సర్వాలంకారశోభితులైన అన్నపూర్ణదేవీ, కాశీవిశ్వేశ్వరస్వామి ఉత్సవర్లను డప్పులహోరు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల మధ్య రథంలో అధిష్ఠింపజేశారు. రథంలో అమ్మవారికి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మంగళహారతులిచ్చారు. అనంతరం శివనామస్మరణల మధ్య భక్తులు రథాన్ని లాగి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు దవనం, పుష్పాలు అమర్చిన అరటిపళ్లను రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఆర్య వైశ్య, జ్యోతినగరవైశ్య దాతలు భక్తులకు వడపప్పు, పానకాలను పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు దాతల సహకారంతో భక్తులు అన్నదానం చేశారు. రాత్రి 7గంటలకు వైశ్య వీధి నుంచి బయలుదేరిన రథం విజలాపురం రోడ్, బ్రాహ్మణవీధి, దిగువవీధుల మీదుగా ఆలయం చేరుకుంది. భక్తులు అడుగడుగునా రథానికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు.


సర్వాలంకారశోభితంగా అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి

కుప్పంలో నాలుగు నామినేషన్లు

కుప్పం: కుప్పంలో మంగళవారం 4 నామినేషన్లు దాఖల య్యాయి. వైసీపీ అభ్యర్థి భరత్ తరఫున మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్, ఆయన సతీమణి ప్రియ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. లాగే బీఎస్ప తరఫున గణేశ్, స్వతంత్ర అభ్యర్థులుగా నీలమ్మ, నాగరాజులు నామినేషన్లు వేశారు.

బీఎస్పీ అభ్యర్థిగా సురేష్ నామినేషన్

పుంగనూరు, ఏప్రిల్ 23: చౌడేపల్లె మండలం శెట్టిపేటకు చెందిన వీ.సురేష పుంగనూరు అసెంబ్లీ స్థానానికి బీఎస్పీ అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూదనరెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

టీడీపీ రావాలి.. దౌర్జన్యం పోవాలి



రొంపిచెర్లలో చల్లాబాబుకు స్వాగతం పలుకుతున్న మైనారిటీలు, చౌడేపల్లెలో ప్రచారం చేస్తున్నవీణారెడ్డి

రొంపిచెర్ల, ఏప్రిల్ 23: పుంగనూరు నియోకజ వర్గంలో అభివృద్ధి కోసం తనతో పాటు ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి కోరారు. మంగళవారం ఆయన రొంపిచెర్లలో ఒంటింటి ప్రచారం చేశారు. సూపర్ సిక్స్ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో బీడీ కార్మికులను ఆదుకుంటామన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఏడాదికి మూడు సిలిండర్లు, ఆర్టీసీలో హహిళలకు ఉచిత ప్రయాణం, చదువుకునే ప్రతి బిడ్డకూ ఏడాదికి రూ 15వేలు అందిస్తామని వివరించారు. అదేవిధంగా పింఛన్లు రూ.4వేలు, దివ్యాంగులకు రూ6వేలు ఇంటి వద్దే అందిస్తారని తెలిపారు.

సోమల: సోమల, అడుసుపల్లె, గుంత చెరువు పల్లెల్లో టీడీపీ శ్రేణులు ఇంటింటా ప్రచారం నిర్వహించాయి. ఎమ్మెల్యేగా చల్లా రామచంద్రా రెడ్డిని, ఎంపీగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్య క్షుడు పీఎం మల్లికార్జున, శివశంకర్, మహేంద్రబాబు, అశోక్ కుమార్, సుబ్బయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు. ● చిన్నఉప్పర పల్లె, గాంధీనగర్, తుగడం వారిపల్లెల్లో జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం తదితరులు ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని ఇంటింటా ప్రచారం నిర్వహించారు.


పులిచెర్ల మండలం ముల్లంగివారిపల్లిలో కరపత్రాలు పంపిణీచేస్తున్న చల్లా పూజారెడ్డి

చౌడేపల్లె: నవ్యాంధ్ర అభివృద్ధి కోసం టీడీపీని గెలిపించాలని చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి కోరారు. చౌడేపల్లె, సంతగేటు, యానాదుల ఇండ్లు, గడ్డంవారిపల్లె రోడ్డు, బజారువీధి, చిన్నకొండమారి, పొదలపల్లె, చిట్రేడ్డిపల్లె తదితర గ్రామాలలో ఆమె ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రవదనమ్మ, నాయకులు ప్రదీప్‌రాజు, విజయలక్ష్మి, హరిప్రసాద్, కార్తీక్, కుమార్‌రెడ్డి, ప్రభాకర్, కిశోర్, బీజేపీ నాయకులు చిన్నికిశోర్, ప్రవీణ్‌కుమార్, మైనార్టీ నాయకులు గని, అమీద్‌ఖాన్, జనసేన నాయకులు హేమంత్ పాల్గొన్నారు.

కల్లూరు: చల్లా రామచంద్రారెడ్డి కుమార్తె చల్లా పూజారెడ్డి పులిచెర్ల పంచాయతీలోని కొత్తపల్లి, ఇస్తరాకులపల్లి, ముల్లంగివారిపల్లిలో ప్రచారం చేశారు. పుంగనూరు నియోజకవర్గం దౌర్జన్యాలు, దాడులు, అక్రమ కేసులకు అడ్డాగా మారిందన్నారు. తన తండ్రికి ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తారని తెలిపారు. టీడీపీ నాయకులు రామ నాథంనాయుడు, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, మురళీధర్‌నాయుడు, ఎల్లారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సదాశివరెడ్డి, వేలు మల్లై, నవీన్, నజీర్, గోపినాయుడు, సరస్వతి, మునికృష్ణమనాయుడు, రమ ణ, శీను, చిన్నబ్బ, నీలంబాబు, రమేష్, మోహన్‌దాస్, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనకు బీసీవైని ఆదరించండి


పుంగనూరులోని దుకాణంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న బీసీవై నాయకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 23: పుంగనూరులో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పన కోసం బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్రయాదవ్‌కు మద్దతు ఇచ్చి గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం పుంగనూరులోని 1, 2, 3, 4 వార్డుల్లో బీసీవై పార్టీ నాయకులు సాంబమూర్తి, హరినాథరెడ్డి తదితరులు ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా బీసీవై పార్టీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పుంగనూరులో 10 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 500 ప్రముఖ కంపెనీలను తీసుకొచ్చి మెగా జాబ్‌మేళా నిర్వహించాలని ప్రయత్నిస్తే వైసీపీ నాయకులు పోలీసుల ద్వారా అడ్డుకుని యువత పొట్టగొట్టారన్నారు. గత ఏడాది మంగళగిరిలో మెగా జాబ్‌మేళా ద్వారా ప్రముఖ ప్రైవేటు కంపెనీల ద్వారా 32 వేలమందికి ఉద్యోగాలు ఇప్పించిన ఘనత రామచంద్రయాదవ్‌కే దక్కిందన్నారు. ఎలాంటి ప్రభుత్వ పదవి లేకుండానే ఉద్యోగాలు ఇప్పించారంటే ప్రజలు ఒక్క అవకాశం ఇస్తే పుంగనూరు ఎంతో అభివృద్ధి సాధిస్తుందని వివరించారు. పతంజలి సంస్థ ద్వారా పుంగనూరులో పరిశ్రమ ఏర్పాటు చేసి 20 వేల మందికి ఉపాధి కల్పిస్తారని చెప్పారు. బీసీవై పార్టీని ఆదరిస్తే ప్రతి కుటుంబానికి పాడిఆవు, రైతులకు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తారని తెలియజేశారు. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడానికి 500 పడకల ఆస్పత్రి నిర్మాణాలకు కృషి చేస్తారని చెప్పారు. వైసీపీ నాయకుల ఆగడాలు, అక్రమాలు, అరాచకాలు, దోపిడీలను అరికట్టడానికి బీసీవై పార్టీ ముందు ఉంటుందన్నారు. అందువల్ల ప్రజలు బీసీవై పార్టీ అభ్యర్థి రామచంద్రయాదవ్‌కు చెరుకురైతు గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

25న రామచంద్రయాదవ్ నామినేషన్

పుంగనూరు: ఈనెల 25వ తేది బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పుంగనూరు అభ్యర్థిగా పోటీ చేసేందుకు నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు సాంబమూర్తి,హరినాథరెడ్డిలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 25న గురువారం ఉదయం స్థానిక కట్టమీద నుంచి ఎంబీటీ రోడ్డు, ఇందిరాసర్కిల్, పాతబస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా పెద్దఎత్తునా ర్యాలీగా వచ్చి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ అందజేస్తారన్నారు. బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు, రామచంద్రయాదవ్ అభిమానులు అధిక సంఖ్యలో హాజరై నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.


పుంగనూరులో ప్రచారం చేస్తున్న బీసీవై పార్టీ నాయకులు

కాలుతున్న అడవి..



పలమనేరు, ఏప్రిల్ 23 : జిల్లాలోనే పేదల ఊటీగా పేరున్న పలమనేరు ప్రాంతంలోని అడవి కాలిపోతోంది. పలమనేరు పట్టణానికి రెండువైపులా ఒకప్పుడు దట్టమైన అడవి విస్తరించి ఉండేది. ఈ అడవి వల్లనే వేసవిలో సైతం ఇక్కడి చల్లటి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేది. నెలరోజులుగా ఈప్రాంతంలో కొందరు పనిగట్టుకొని అడవికి నిప్పు పెడుతుండటంతో వందలాది ఎకరాల్లో ఉన్న అడవి కాలిపోతోంది. గతంలో వేసవి రాగానే అటవీశాఖ అధికారులు గ్రామాల్లో సమావేశాలు పెట్టి అడవికి నిప్పు పెట్టడం వలన కలిగే అనర్థాలను ప్రజలకు వివరించేవారు. అంతేగాక అటవీ ప్రాంతాల్లో ఫైర్‌లైన్ పేరుతో ఒకచోట నిప్పు పెట్టినా అడవి మొత్తం నిప్పు అంటుకోకుండా సుమారు 20 అడుగుల మేర చెట్లు తొలగించే వారు. ఇలా చేయడం వలన నిప్పు అంటుకొన్నా అడవి మొత్తం వ్యాపించకుండా ఈ ఫైర్‌లైన్ల వరకు మాత్రమే మంటలు వచ్చి ఆరిపోయేవి. ఇటీవలకాలంలో అటవీ శాఖ అధికారులు అటవీ సంరక్షణ గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. అటవీ ప్రాంతంలో తిరిగే ఆనవాయితీని వదిలేశారు. దీంతో ఆకతాయిలు అడవికి నిప్పుపెడుతున్నారు. ఫలితంగా నెల రోజులుగా దాదాపు 500 ఎకరాలకుపైగా అడవి కాలిపోయింది. మంగళవారం మధ్యాహ్నం పట్టణ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని అటవీ ప్రాంతానికి గుర్తుతెలియని ఆకతాయిలు నిప్పుపెట్టారు. దీంతో దాదాపు 50 ఎకరాలకు పైగా అడవి కాలిపోయింది. ఇకనైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి పలమనేరు అడవిని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించండి


పరీక్షలపై సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో

పలమనేరు, ఏప్రిల్23 : పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలు పకడ్బందీగా నిర్వ హించాలని ఆర్డీవో మనోజ్‌రెడ్డి సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఈ నెల 27న జరగనున్న పాలి టెక్నిక్ పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు పరిధిలో సుమారు 1463 మంది, కుప్పం పరిధిలో సుమారు 581 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. ఇందు కోసం పలమనేరులో 5, కుప్పంలో 2 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు పరీక్షకు గంటముందు ఆయా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. పరీక్ష నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఉండేందుకుగాను పాలిసెట్ కో-ఆర్డినేటర్లు రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, విద్యుత్, వైద్య, ఆర్టీసీ, విద్యాశాఖల సిబ్బందికి సూచనలిచ్చారు. పోలీసుల ఆధ్వ ర్యంలో బందోబస్తు, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాగునీటి వసతి, శానిటేషన్, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశానికి పలమనేరు కో-ఆర్డినేటర్ మొహమ్మద్, కుప్పం కో-ఆర్డినేటర్ జగన్నాథరావు, యుగంధర్, పలమనేరు డీఎస్పీ మహేశ్వరరెడ్డి, పలమనేరు మున్సిపల్ ఛైర్మన్ రమణారెడ్డి, తహసీల్దార్, ఎంఈవో లీలారాణి, సీఐలు చంద్రశేఖర్, చిన్నగోవిందు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును గెలిపించుకుందాం

శాంతిపురం, ఏప్రిల్ 23 : బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం చంద్రబాబును గెలిపించుకుందామని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని కోనేరుకుప్పం కోలాలతిమ్మనపల్లె, 121పెద్దూరు, జేబీ కొత్తూరు, బెండనకుప్పం గ్రామాల్లో యూనిట్ ఇన్‌చార్జిలు ఆర్ఎస్ మణి, గోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం మండల టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చేసిన అక్రమాలు, అరాచకాలు, దాడులు, భూ కబ్జాల గురించి వివరించారు. యువతకు ఉపాధి దొరకాలన్నా, పేదలకు సంక్షేమ ఫలాలు అందా లన్నా, పల్లెలు ప్రగతి పథంలో పరుగులు పెట్టాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అనంతరం ఎస్.గొల్లపల్లె గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు జయచంద్ర, విజయకుమార్, మునిరత్నం, అశోక్, వెంకట్రామప్ప, చందు, చిరు, బాబులతో పాటు 10 మంది కుటుంబాలు టీడీపీ నేత హరినాథ్‌రెడ్డి సహకారంతో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసుల సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ డాక్టర్ సురేష్‌బాబు టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జిలు, విజయరామిరెడ్డి, చంద్ర శేఖర్, యూనిట్ ఇన్‌చార్జిలు రమేష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఏఎంసీ నాగరాజు, బసవరాజు, జయ రాజ్, ఈడిగ రమేష్, చలపతిస్వామి, నారాయణరెడ్డి, గోవిందరాజులు, అర్జునప్ప, లక్ష్మీనారాయణ, ఇలియాజ్, గంట్లప్ప, జయప్ప, సత్యప్ప, మహిళ నేతలు, శ్యామల, శకుంతల, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన ఎస్.గొల్లపల్లె గ్రామ వైసీపీ కార్యకర్తలు

బీ.ఫారం అందుకొన్న అమర్



పలమ నేరు, ఏప్రిల్ 23 : పల మ నేరు తెలు గుదేశం పార్టీ అభ్య ర్థి మాజీ మంత్రి అమర నాథరెడ్డికి ఆ పార్టీ అధినేత చంద్ర బాబు బి.ఫారంను అంద జేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని అభ్యర్థులు రెండురోజుల క్రితం తమ బి.ఫారంలను విజయవాడలో జరిగిన సమావేశానికి హాజరై స్వీకరించారు. నామినేషన్ ప్రక్రియలో భాగంగా అమరనాథ రెడ్డి ఆ సమావేశానికి వెళ్లలేకపోయారు. పలమనేరులో సోమ వారం నామినేషన్ ప్రక్రియ ముగియడంతో విజయనగరం జిల్లా శృంగవరపు కోటలో పర్యటిస్తున్న చంద్ర బాబును కలిసి బి.ఫారంను అందుకున్నారు. ఈ సందర్భంగా మంచి మెజారిటీలో గెలవాలని బాబు శుభాకాంక్షలు తెలియజేశారు.

పుంగనూరు వాల్మీకి సంఘం అధ్యక్షుడిగా సుకుమార్



రొంపిచెర్ల, ఏప్రిల్ 23: టీడీపీ పుంగనూరు నియోజకవర్గ వాల్మీకి సంఘం అధ్యక్షుడుగా పుంగనూరుకు చెందిన కె.సుకుమార్ నియమితులయ్యారు. మంగళవారం రొంపిచెర్లలోని పార్టీ కార్యాలయంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. రాష్ట్ర కిస్ట్రియన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి గిరిబాబు, బీసీ నాయకుడు జనార్ధన్, సీవీ.రెడ్డి, దేశాద్రిశ్రీనివాసులు, విశ్రాంత ఎస్ఐ రవి, రవికుమార్, గంగరాజా, కె.సులోచన పాల్గొన్నారు.

వికలాంగురాలిపై అత్యాచారయత్నం

చౌడేపల్లె, ఏప్రిల్23: వికలాంగురాలిపై ఓ ఆటో డ్రైవర్ అత్యాచారానికి యత్నించాడు. చౌడేపల్లె మండలంలోని ఓ గ్రామంలో సోమవారం రాత్రి రికార్డింగ్ డ్యాన్స్ జరిగింది. ఇంట్లో వారంతా ఆ కార్యక్రమానికి వెళ్లడంతో వికలాంగురాలు ఇంట్లో నిద్రించింది. ఆ సమయంలో అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆమెపై అత్యాచారం చేయబోయాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి అతడిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

పట్రపల్లెలో సీతారాముల కల్యాణం

సోమల, ఏప్రిల్ 23: మండలంలోని పట్రపల్లె కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మూల విరాట్‌లకు విశేష పూజలు జరిపారు. కల్యాణ వేదికపై ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపచేసి అర్చకులు కల్యాణం జరిపారు. యాదవ సంఘ సభ్యులచే కల్యాణోత్సవం జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భాగవతారణి అనసూయ సీతారాముల కల్యాణ ఘట్టాన్ని భక్తులకు వివరించారు. అనంతరం స్వామివారిని గ్రామ వీధుల్లో ఊరేగించారు.

ప్రపంచానికి పుస్తకం ఓ దిక్సూచి


పుస్తక దినోత్సవంపై మాట్లాడుతున్న హెచ్ఎం శ్రీవాణి

కల్లూరు, ఏప్రిల్ 23: ప్రపంచానికి పుస్తకం ఓ దిక్సూచి అని హెచ్ఎం శ్రీవాణి తెలిపారు. పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ మంచి పుస్తకం ఓ మంచి నేస్తంతో సమానమనే విషయాన్ని ప్రతి విద్యార్థి గుర్తించాలన్నారు. మంచి పుస్తకాలను చదివితే జ్ఞానం, ఆనందం, సంతోషం దొరుకుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటసిద్ధులు, రాజేంద్ర, కాటయ్య, రాజశేఖర్, శివరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం


సీతా రామ లక్ష్మణ ఆంజనేయ స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఉభయదారులు

చౌడేపల్లె, ఏప్రిల్23: బజారు వీధిలో వెలసిన హరి మందిరంలో సీతారామ కల్యాణం కనుల పండువగా సాగింది. మంగళ వారం వేదపండితుల ఆధ్వర్యంలో సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వాములకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా కళ్యాణం జరిపించారు. ఉభయదారులుగా బొగ్గరపు సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు వ్యవహరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మాజీ సర్పంచ్ ప్రకాశం రెడ్డి మృతి



సదుం, ఏప్రిల్ 23: మండలంలోని 79ఏ చింతమాకులపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ తమటం ప్రకాశం రెడ్డి(76) మంగళవారం ఉదయం మృతిచెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన మృతికి పలువురు స్థానికులు, పార్టీల నేతలు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సమోసా బాషా నామినేషన్

పలమనేరు, ఏప్రిల్23 : పలమనేరులోని బస్టాండు పరిసరాల్లో సమోసాలు అమ్మకొనే కే.బాషా పలమనేరు అసెంబ్లీ స్థానానికి ఈ నెల 22న స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి మనోజ్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందించారు. పలమనేరు గాంధీనగర్‌లో నివాసమున్న బాషా (51)కు రాజకీయాలంటే పిచ్చి. ఈయనకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

చిన్నారికి ప్రాణ భిక్ష పెట్టండి



విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జెస్సిక

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 23: కిడ్నీల వ్యాధితో బాధపడుతూ విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తన బిడ్డ ప్రాణాలు కాపాడేందుకు దాతలు సహాయం చేయాలని పుంగనూరు తూర్పుమొగసాలకు చెందిన ప్రేమ్‌కుమార్, సుభాషిణి దంపతులు వేడుకుంటున్నారు. తమ కుమార్తె జెస్సిక(7)కు రెండు కిడ్నీలు చెడిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారని తెలిపారు. విజయవాడ ఆంధ్ర ఆస్పత్రిలో చేర్పించామని, తమకు ఉన్న ఆస్తులు విక్రయించి దాదాపు రూ.10లక్షలు ఖర్చు చేశామని, ఇంకా రూ.7లక్షలు ఖర్చు చేస్తే ప్రాణాలతో బయటపడుతుందని వైద్యులు చెప్పడంతో దాతల సహాయం కోరుతున్నామని చెప్పారు. సాయం చేయదలచిన వారు 7799390447(ఫోన్ పే)గాని, పుంగనూరుకు చెందిన ఎస్‌బీఐ బ్యాంక్ ఖాతా నెంబరు 34576133056కు గాని అందించాలని కోరారు.

వలంటీర్ల రాజీనామాలపై వివరాలు పంపండి

రామచంద్రయాదవ్ పిటిషన్‌పై హైకోర్టు విచారణ

పుంగనూరు, ఏప్రిల్ 23: ఇప్పటివరకు ఎంతమంది వలంటీర్లు రాజీనామా చేశారు.. ఎంతమంది పనిచేస్తున్నారు అనే వివరాలు అందజేయాలని హైకోర్టు ఎన్నికల సంఘాన్ని మంగళవారం ఆదేశించింది. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసే వరకు వలంటీర్ల రాజీనామాలు ఆమోదించరాదని బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ హైకోర్టులో వేసిన పిటిషన్ పై మంగళవారం కోర్టు విచారణ జరిపింది. ఈ మేరకు వలంటీర్ల వివరాలు పంపాలని ఆదేశిస్తూ విచారణను బుధవారానికి వాయిదా వేసినట్లు రామచంద్రయాదవ్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 23: రోడ్డు ప్రమాదంలో మాజీ ఎంపీటీసీ మృతి చెందాడు. నారాయణవనం మండలం కొండలచెరువుకు చెందిన మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యంరెడ్డి(73) ద్విచక్ర వాహనంపై రాచపాళెంకు బయలుదేరాడు. పుత్తూరు బైపాస్‌లోని తొరూరు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడిన సుబ్రమణ్యంరెడ్డికి పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పుత్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పక్కదారి పట్టిన రూ.20 కోట్లు?

- రుయా ఆడిట్‌లో వెలుగుచూస్తున్న అక్రమాలు
- కోట్లాది రూపాయల మాయం వెనుక వైసీపీ నేతల హస్తం
- కీలకమైన రికార్డులూ మాయం?



ఆడిట్ జరుగుతున్న గది

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 23 : తిరుపతి రుయాస్పత్రిలో జరుగుతున్న ఆడిట్ తనిఖీల్లో పెద్దఎత్తున అక్రమాలు వెలుగు చూస్తున్నట్లు సమాచారం.గత ఐదేళ్లలో కోట్లాది రూపాయల మాయం వెనుక వైసీపీ నేతల ప్రమేయముందన్న ప్రచారం జరుగుతోంది. ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో రాజకీయ ప్రమేయంతో నామినేట్ అయిన ఓ వ్యక్తి ప్రమేయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఐదేళ్లుగా రుయాస్పత్రిలో జరిగిన ఆర్థిక లావాదేవీలు, కొనుగోళ్లు, బిల్లుల మంజూరు, ఇతర నిధులు కేటాయింపు, వాటి ఖర్చులకు సంబంధించి ఇరవై రోజులుగా అడిట్ అధికారులు విచారణ చేస్తున్నారు. ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే ఆడిట్ కావడంతో 2018-19 సంవత్సరం నుంచి 2023-24 సంవత్సరం వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలను ఆడిట్ అధికారులు పరిశీలిస్తున్నారు. సంబంధిత సిబ్బందిని కూడా విచారిస్తున్నట్లు సమాచారం.ఈ ఆడిట్‌లో ఎన్నో అక్రమాలతో పాటు దాదాపు రూ. 20 కోట్లకు పైగా నిధులు పక్కదోవ పట్టినట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం. మరో రెండు రోజుల్లో ఆడిట్ పూర్తికావస్తుండడంతో ఆడిట్ అధికారులు ప్రభుత్వానికి ఏ విధమైన నివేదికలు అందించనున్నారో అని అక్రమాలకు పాల్పడిన వారు ఆందోళన చెందుతున్నారు.ఒక్క ఆరోగ్యశ్రీలోనే రూ. కోట్ల నిధులు దుర్వినియోగమైనట్లు ఆడిట్ అధికారులు గుర్తించారు. వీటితోపాటు అభివృద్ధి కమిటీ ఒత్తిడి మేరకు అధికారులు పలు ఏజన్సీ నిర్వాహకులతో కుమ్మక్కై రూ. కోట్ల నిధులు పక్కదోవ పట్టించారని విచారణలో గుర్తించినట్లు తెలిసింది. రుయాస్పత్రి నిర్వహణకు ఏడాదికి దాదాపు రూ. 24 కోట్ల నిధులు అవసరమవుతాయి. వీటిలో రూ. 5కోట్లకు పైగా పక్కదోవ పట్టినట్లు సమాచారం. వీటితోపాటు గడిచిన ఐదేళ్ల కాలంలో ఆరోగ్యశ్రీ, హెచ్‌డీఎస్‌కు సంబంధించి మరో రూ. 5 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగమైనట్లు తెలిసింది. వీటికి సంబంధించి ఇప్పటికే పలు కీలకమైన రికార్డులను ఆడిట్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

ఆరోగ్యశ్రీలో వైద్య సేవలకు ఏడాదికి సుమారు రూ. 5 కోట్ల వరకు ఆరోగ్యశ్రీ ఖాతాలో జమవుతుంది. ఇందులో ఆరోగ్యశ్రీ వైద్య సేవల కింద అభివృద్ధి కమిటీ చెప్పిన వారికే వైద్య పరికరాలు, మందుల కొనుగోళ్ల పేరుతో దాదాపు ఏడాదికి రూ. 2 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. పది కోట్ల వరకు పక్కదోవ పట్టినట్లు అధికారులు గుర్తించారు. 2020-21వ సంవత్సరంలో ఓ అధికారి ఆరోగ్యశ్రీ నిధులు పక్కదోవ పట్టించి సస్పెండయ్యాడు. అప్పటి అధికారులు నిధులు పక్కదోవ పట్టించిన ఉద్యోగిని సస్పెండు చేశారు తప్ప నిధులు రికవరీ చేయలేదు. దీంతో ఆ ఏడాదికి సంబంధించిన రికార్డులను ప్రస్తుతం ఆడిట్ అధికారులు అడగ్గా రుయా అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు.చివరకు ఆ రికార్డులు లేవని చెప్పి జారుకునే ప్రయత్నం చేస్తున్నారు. అలాగే ఆరోగ్యశ్రీ ఆసరా పేరుతో రోగులు కాని వారి పేరుతో దాదాపు రూ.3కోట్ల వరకు నిధులు దుర్వినియోగమైన విషయం కూడా ఆడిట్ అధికారులు గుర్తించారు.ఈ విషయం ఏడాది కిందట వెలుగులోకి రావడంతో అవుట్‌సోర్సింగ్ కింద పనిచేసే డీఈవోలను ఇందుకు సూత్రధారులుగా చూపి సంబంధిత అధికారులను తప్పించారు.తరువాత ఈ విషయాన్ని గోప్యంగా వుంచేయడం వెనుక వైసీపీ నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరిగింది. ఈ విషయంపై కూడా ఆడిట్ అధికారులు విచారిస్తున్నట్లు సమాచారం.

ఆడిట్‌లో వెలుగుచూసిన విషయాలు

- పారిశుధ్య, సెక్యూరిటీ ఏజన్సీ నిర్వాహకులు తక్కువ మంది సిబ్బందిని నియమించి రికార్డుల్లో ఎక్కువ మందిని చూపుతున్నట్లు కూడా గుర్తించారు. వీరిలో ప్రధానంగా పారిశుధ్య ఏజన్సీ నిర్వాహకులు 205 మంది కార్మికులకు గాను 130 మందినే నియమించుకోవడంతో పాటు వారికి కూడా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారని గుర్తించారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటివి చెల్లించకపోగా పారిశుధ్యానికి సంబంధించి ఎలాంటి సామాగ్రి కొనుగోలు చేయకనే నెలకు రూ.70 లక్షలకు పైగా బిల్లులు అందుకుంటున్నట్లు గుర్తించారు.
- సప్తవర్ణాల పేరుతో ఏజన్సీ నిర్వాహకులు ఆస్పత్రిలోని రోగుల పడకలపై రోజూ దుప్పట్లను మార్చాలి. కానీ వారానికి ఒకటి రెండు రోజులు మాత్రమే పడకలపై దుప్పట్లు మారుస్తున్నట్లు గుర్తించారు.
- సూపరింటెండెంట్ స్థాయి అధికారి వాడే వాహనానికి నెలకు రూ. 9 వేల లోపు మాత్రమే డీజిల్‌కు ఖర్చు చేయాలి.అయితే గతంలో పనిచేసిన సూపరింటెండెంట్ నెలకు రూ. 15 వేలకు పైగా డీజిల్‌కు ఖర్చు చేసిన విషయాన్ని అడిట్ అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి అప్పటి అధికారి నుంచి వివరణ తీసుకుని నిధుల రికవరీకి రంగం సిద్ధం చేస్తున్నారు.
- ప్రభుత్వం నుంచి ఏడాదికి రూ.3 కోట్ల విలువైన మందులు సరఫరా అవుతున్నా అదనంగా మందుల, వైద్య పరికరాల పేరుతో రూ. కోటికి పైగా నిధులు ఖర్చు చేసినట్లు అధికారులు గుర్తించారు. దీనికి సంబంధించి రికార్డులు కూడా మాయమైనట్లు సమాచారం.
- హెచ్‌డీఎస్ కింద ఆస్పత్రి అభివృద్ధికి ఏడాదికి దాదాపు రూ. కోటి వరకు నిధులు మంజూరవుతాయి. వీటితోపాటు దుకాణాల నుంచీ అద్దెల రూపంలో మరో రూ. 30 లక్షల వరకు వస్తాయి. వీటిలో రూ. కోటికి పైగా నిధులను ఎలాంటి బిల్లులు లేకుండానే స్వాహా చేసినట్లు సమాచారం.
- ఆస్పత్రుల్లో కేవలం రెండు అంబులెన్సులు మాత్రమే ఉన్నాయి. ఇందులో ఒకటి వీఐపీల కోసం ఉపయోగిస్తుండగా మరొకటి రోగుల కోసం ఉపయోగిస్తున్నారు. కానీ డీజిల్ ఖర్చుల కింద ఏడాదికి రూ. 5 లక్షల నిధులను పక్కదోవ పట్టించిన విషయంపై కూడా ఆడిట్ అధికారులు ఆరా తీస్తున్నారు. అలాగే వాహనాల రిపేర్లు, అధికారుల ఫోన్ల ఖర్చు, స్టేషనరీ పేరుతో రూ. పది లక్షలు స్వాహా చేసినట్లు కూడా ఆడిట్ అధికారులు గుర్తించారు.
- ఆస్పత్రిలో తలుపులు, కిటికీలు, మంచాలు, వీల్‌చైర్లు, ఫ్యాన్లు, ఏసీలు వంటివి రిపేరు చేసేందుకు ఏడాదికి రూ. 15 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు అధికారులు దస్త్రాల్లో చూపుతున్నా వాస్తవంగా వీటి నిర్వహణకు రూ. 5 లక్షలు కూడా ఖర్చు కాదని ఆడిట్ అధికారులు గుర్తించారు.వీటితో పాటు కార్యాలయంలో ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన విభాగంలో ఉన్న ఇద్దరు ఉద్యోగులు రూ. లక్షల నిధులను పక్కదోవ పట్టించడంలో ప్రధాన సూత్రధారులుగా వ్యవహరించినట్లు కూడా అధికారులు గుర్తించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుడిపాల, ఏప్రిల్ 23: మండలంలోని బెంగళూరు-చెన్నై రహదారిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. సీపీఎఫ్ ఫ్యాక్టరీ వెనుకభాగంలో ఓ మృతదేహం పడివున్న విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు.

ఆ ఏడు నియోజకవర్గాల్లో టీడీపీదే గెలుపు



- వైసీపీకి చరమగీతం పాడడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు
- చంద్రబాబు సీఎం కావడం ఖాయం
- చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి దగ్గుమళ్ల

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 23: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో చిత్తూరు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ గెలుపునకు ఎలాంటి ఢోకా లేదని కూటమి చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా డాక్టర్ థామస్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న దగ్గుమళ్ల మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు పార్లమెంట్ పరిధిలో ప్రజలంతా టీడీపీ వైపే ఉన్నారని తెలిపారు. వైసీపీ విధానాలపై విసుగెత్తిన ప్రజలు చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. వారం రోజులుగా కుప్పం, పలమనేరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమానికి తరలి వచ్చిన జనసందోహమే దీనికి నిలువెత్తు నిదర్శనమన్నారు. మార్పు కోరుకుంటున్న ప్రజలు జగన్ సర్కార్‌కి చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రమంతా సైకిల్ జోరు కొనసాగుతోందని, తామంతా చంద్రబాబును ముఖ్యమంత్రి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు.

● అధికారులూ.. పారదర్శకంగా విధులు నిర్వహించండి

ఎన్నికల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులంతా పారదర్శకంగా పనిచేయాలని దగ్గుమళ్ల ప్రసాదరావు విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలు అధికారంలోకి వచ్చి పోతుంటాయని, శాశ్వతంగా ఉండవన్న నిజాన్ని అధికారులు గుర్తించాలని సూచించారు. ఈ నేపథ్యంలో తమ కర్తవ్యాన్ని చిత్తశుద్ధితో నిర్వహించి ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని హితవు పలికారు. తప్పులు చేస్తే తర్వాత అధికారంలోకి వచ్చే పార్టీ ఉపేక్షించదన్న విషయాన్ని గుర్తించాలని హితబోధ చేశారు.

అయ్యో బాలాజి..!

- మాజీ అధికారిని నమ్మి ఇబ్బందుల పాలవుతున్న ఎంపీడీవో
- చిత్తూరు నుంచి రిలీవ్ చేయించుకుంటే నెల్లూరులో పోస్టింగ్ ఇవ్వని కలెక్టర్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 23: జడ్పీ మాజీ అధికారిని నమ్మి ఇబ్బందుల పాలవుతున్నారు ఎంపీడీవో బాలాజి. ఎంపీడీవోగా పదోన్నతి వచ్చినప్పటికి చాలా కాలంగా జడ్పీని వీడకుండా జడ్పీ మాజీ అధికారి నమ్మిన బంటుగా నోడల్ అధికారిగా కొనసాగుతూ వచ్చారు. ఎన్నికల నేపథ్యంలో ఆయన్ను నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరు మండలానికి బదిలీ చేశారు. అయినా చిత్తూరులోనే కొనసాగుతూ వచ్చారు. ఇటీవల బైరెడ్డిపల్లి ఇన్‌చార్జ్ ఎంపీడీవో రాజేష్ పలమనేరులోని బాలాజి ఇంట్లో దూరి అనధికార సోదాలు నిర్వహించడంతో భయాందోళనకు గురైన బాలాజీ కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను వేడుకుని చిత్తూరు నుంచి రిలీవ్ చేయించుకున్నారు. అయితే నెల్లూరు జిల్లా కలెక్టర్ జాయిన్ చేయించుకునేందుకు ససేమిరా అన్నారు. ఎన్నికల కోడ్‌కు ముందు బదిలీ చేస్తే ఇప్పుడు వస్తే చేర్చుకోవాలా...అని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎన్నికల కమిషన్‌కు లేఖ రాసి, వారి ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. దీంతో ఆయన పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడినట్లు అయింది.

చెరువు మట్టి తరలిపోతోంది



చెరువు నుంచి అక్రమంగా తరలిస్తున్న మట్టి

పాలసముద్రం, ఏప్రిల్ 23 : మండలంలోని వనదుర్గాపురం చెరువు నుంచి రెండు రోజులుగా మట్టి పక్కనే ఉన్న తమిళనాడుకు తరలిపోతోంది. సరిహద్దు ప్రాంతం కావడంతో అక్కడి ఇటుక బట్టీల యజమానులు చెరువులో మట్టి యథేచ్ఛగా తరలించేస్తున్నారు. తమిళనాడులో వాల్టా చట్టం పకడ్బందీగా అమలవుతుండడంతో చెరువుల్లో పిడికెడు మట్టి తీయడానికి కూడా అక్కడి ప్రభుత్వం ఒప్పుకోవడం లేదు. ఈ క్రమంలో మండలంలోని అధికార పార్టీ నాయకుల అండదండలతో ఇక్కడి చెరువు మట్టిని తరలిస్తున్నారు. జేసీబీలు పెట్టి ట్రాక్టర్లతో మట్టి తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

కొనసాగుతున్న భానుడి ప్రతాపం

నిండ్రలో అత్యధికంగా 42.9 డిగ్రీలు



బోసిపోయిన గాంధీసర్కిల్

చిత్తూరు కలెక్టరేట్, ఏప్రిల్ 23: జిల్లాలో ఎండలు కొనసాగుతున్నాయి. మంగళవారం అత్యధికంగా నిండ్రలో 42.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే పులిచెర్లలో 42.4, శ్రీరంగరాజపురం 41.5, తవణంపల్లె 41.3, సోమల 41.2, బంగారుపాళ్యం 41, కుప్పం 40.8, గుడిపాల 40.6, నదుం 40.4, పుంగనూరు 40.3, చిత్తూరులో 40.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వడదెబ్బకు మహిళ మృతి



మృతి చెందిన కృష్ణమ్మ

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 23: మండలంలో మంగళవారం వడదెబ్బతో మహిళ మృతి చెందింది. పరమేశ్వరమంగళం దళితవాడకు చెందిన ఎం.కృష్ణమ్మ ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు ఆమెను నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా చనిపోయినట్లు తెలిపారు.

సినీ ఫక్కీలో టాటా సుమో ఛేజింగ్

పట్టుబడిన అక్రమ మద్యం బాక్సులు - డ్రైవర్ పరారీ అంటూ కేసు

వి.కోట, ఏప్రిల్ 23: సినీ ఫక్కీలో చేజ్ చేసి అక్రమంగా మద్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. వాహనంలోని మద్యం స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. వి.కోట - నాయకనేరి మార్గంలో బైరుపల్లె క్రాస్ వద్ద సోమవారం రాత్రి కర్ణాటక నుంచి వస్తున్న టాటా సుమోను పోలీసులు ఆపారు. పోలీసులను గమనించిన డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా ఓగు మీదుగా గ్రామాల వైపు మళ్లించాడు. అప్రమత్తమైన పోలీసులు మూడు పైపులా విడిపోయి ఛేజింగ్ చేశారు. చివరకు యాలకల్లు వద్ద వాహనాన్ని అడ్డుకున్నారు. వాహనంలో 30 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడిందని, గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశారు. కాగా పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు. వాహనం సహా డ్రైవర్ పట్టుబడ్డాడని, అందులో 40 బాక్సుల మద్యం ఉందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.

గోప్యత ఎందుకో..!?

సోమవారం రాత్రి మద్యం పట్టుబడితే, ఆ విషయాన్ని మంగళవారం రాత్రి వరకు గోప్యంగా ఉంచి ఆపై కేసు నమోదు చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. కేఏ 21- ఎన్ 4956 వాహనంలో రూ. 1.81 లక్షల విలువ చేసే కర్ణాటక మద్యం ఒరిజినల్ చాయిస్ విస్కీ 90 ఎంఎల్, 180 ఎంఎల్ 1584 టెట్రా పాకెట్లు ఉన్నట్లు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు. ఇద్దరు పరారయ్యారని, త్వరలోనే వారిని పట్టుకుంటామని స్పష్టం చేశారు.



పోలీసులకు పట్టుబడిన టాటాసుమోలో మద్యం బాక్సులు

రామకుప్పం ఎస్‌ఐపై డీఎస్పీకి ఫిర్యాదు

రామకుప్పం, ఏప్రిల్ 23: వైసీపీ నేతల ప్రోద్బలంతో రామకుప్పం ఎస్‌ఐ తమను వేధిస్తున్నారంటూ మండల పరిధిలోని పంద్యాలమడుగు పంచాయతీ కావలిమడుగు గ్రామానికి చెందిన వడివేలు, తంగవేలు, రాజ్‌కుమార్, కార్తీక్‌లు మంగళవారం కుప్పం డీఎస్పీ శ్రీనాథ్‌కు ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదు మేరకు...ఇటీవల కుప్పంలో చంద్రబాబు నామినేషన్ దాఖలు కార్యక్రమంలో పాల్గొనేందుకు కావలిమడుగు నుంచి వంద మంది వెళ్లారు. ఆ మరుసటి రోజు రామకుప్పం ఎస్‌ఐ తమ సిబ్బందితో కలిసి గ్రామానికి వెళ్లారు. వడివేలు, తంగవేలు, రాజ్‌కుమార్, కార్తీక్ ఇళ్లకు వెళ్లారు. ఎటువంటి తాఖీదులు లేకుండా ఇళ్లలో తనిఖీలు చేశారు. టీడీపీ కార్యక్రమానికి ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. అది తమ ఇష్టం అని వారు సమాధానమిచ్చారు. దీంతో ఆయన వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'మీ కథ చూస్తా' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సోమవారం సాయంత్రం తిరిగి ఆయన తమ సిబ్బందితో మళ్లీ కావలిమడుగుకు వెళ్లి వారి కుటుంబసభ్యులతో మాట్లాడారు. వారి వద్ద నాటుతుపాకులున్నాయని మంగళవారం ఉదయం 10గంటలలోపు అప్పగించకపోతే 'మీ అంతు చూస్తా' నని బెదిరించారు. మరోసారి టీడీపీ కార్యక్రమాల్లో కన్పిస్తే 'మీ కథ చూస్తా' నంటూ హెచ్చరించారు. ఈ విషయమై ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా తనపై కావలిమడుగు గ్రామస్తులు డీఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నవన్నీ అబద్ధాలేనన్నారు. తాను నిజాలతో త్వరలోనే వారి బండారం బయటపెడతానని తెలిపారు.

ఎమ్మెల్సీ కంచర్ల ఫిర్యాదు

కావలిమడుగు గ్రామంలోని టీడీపీ కార్యకర్తలను రామకుప్పం ఎస్‌ఐ శివకుమార్ వేధిస్తున్నారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కూడా కుప్పం డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతల ప్రోద్బలంతో కక్షసాధింపు చర్యలకు ఉపక్రమించారని ఫిర్యాదులో తెలిపారు. అంతేగాకుండా ఎన్నికల్లో వైసీపీకి మద్దతివ్వాలని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. లేకుంటే ఇబ్బందులు తప్పవని, అంతు చూస్తానని బెదిరిస్తున్నారని డీఎస్పీ దృష్టికి తెచ్చారు. ఈ విషయాలపై సమగ్ర విచారణ జరిపి ఎస్‌ఐపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఆ ఫిర్యాదు నకళ్లను రాష్ట్ర ఎన్నికల అధికారికి, డీజీపీకి, జిల్లా ఎన్నికల అధికారికి, ఎస్పీకి, కుప్పం ఎన్నికల అధికారులకు పంపారు.

అటెండరు రూపాయి లంచం

- నైతిక బాధ్యత వహించి మద్రాసు ప్రావిన్స్ పీఎం రాజీనామా
- నాడు నైతిక విలువలకు పెద్దపీట వేసిన చిత్తూరుజిల్లావాసి

● చిరస్మరణీయులు




బొల్లిని
మునస్వామి నాయుడు

తమపై వేల రూ.కోట్ల అవినీతి ఆరోపణలు వచ్చినా ఇప్పటి నేతలు పదవులను పట్టుకుని వేలాడుతూనే ఉన్నారు. అక్రమాస్తుల కేసులున్నా వెరవడంలేదు. పైగా నీతి బోధనలు చేస్తున్నారు. కానీ.. తన వద్ద పనిచేసే ఒక అటెండరు రూపాయి లంచం తీసుకున్నాడని మద్రాస్ ప్రావిన్స్ ప్రధానమంత్రి పదవికే రాజీనామా చేశారు బొల్లిని మునస్వామి నాయుడు. నాడు నైతిక విలువలు పాటించి.. నేటి తరానికీ ఆదర్శంగా నిలిచిన ఆయన చిత్తూరు జిల్లాకు చెందిన వారు. చిత్తూరు సమీపం వేపంజేరిలో 1885 ఏప్రిల్‌లో బొల్లిని మునస్వామి నాయుడు జన్మించారు. 1908లో న్యాయవాద వృత్తిలో డిగ్రీ పొందారు. సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించి మంచి పేరు పొందారు. 1920లో చిత్తూరు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా, 1918లో 16వ చిత్తూరు మండల మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా, 1921లో చిత్తూరు మున్సిపల్ చైర్మన్‌గా, 1923 నుంచి చిత్తూరు జిల్లా బోర్డు (జిల్లా పరిషత్) అధ్యక్షుడిగా పనిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయ సభ్యుడిగానూ కొనసాగారు. 1919-25 మధ్య మద్రాసు శాసనసభ సభ్యుడిగా, 1930లో మద్రాసు ప్రావిన్స్ ప్రధానమంత్రిగా ఎన్నికై 1934వరకు కొనసాగారు. అప్పట్లో ఈ పదవిని ప్రధానమంత్రి అనేవారు. తమ గ్రామాల సమీపంలోని అడవుల్లో పశువులు మేపుకొనేందుకు ఆయన అనుమతించారు. ఈయన ప్రధానమంత్రిగా పనిచేస్తున్న రోజుల్లో ఓ అటెండరు రూపాయి లంచం తీసుకున్నట్లు శాసనసభలో బయటపడింది. దీనిపై విచారణ జరిపితే నిజమని తేలింది. వెంటనే ఆయన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి జట్కాబండిలో ఇంటికి వెళ్లారట. ఈయన మహోన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించిన ఆంగ్లేయులు 1926లో 'దివాన్ బహదూర్' పురస్కారంతో సత్కరించారు.

- చిత్తూరు కల్చరల్

● గాసిప్

శిష్యవాత్సల్యం



పూర్వాశ్రమంలో కాంగ్రెస్ పార్టీలో ఒక్క వెలుగు వెలిగిన పెద్దాయన. కాలం కలిసి రాక వైసీపీలో చేరి, టీడీపీ మీదుగా తిరిగి సొంతగూటికే చేరారా మధ్య. పార్టీల మధ్య దూకే సమయాల్లో రాజకీయ సన్యాసం గురించి కూడా ఆలోచించారేమో.. చాలా గ్యాప్ తీసేసుకున్నారు. ఈయనతోనే ఉన్న ప్రియశిష్యుడు ప్రస్తుతమున్న పార్టీని వీడి, పూర్వ కాంగ్రెస్‌లోకి జంప్ చేసి.. కుప్పం అభ్యర్థి అయిపోయారు. ఈ క్రమంలో ఇటీవల తమ పార్టీ ప్రచార యాత్ర ప్రారంభించిన ఈ పెద్దాయన శాంతిపురం మండలంలోని రెండు గ్రామాలకు వెళ్లారు. ఆ గ్రామాలలో ఆయన శిష్యుడి సామాజిక వర్గం ఓటర్లు ఎక్కువ. పూర్వాశ్రమంలో అతడు తనకిచ్చిన గట్టి మద్దతు, అప్పట్లో జిల్లా స్థాయి పదవి పొందడంలో కూడగట్టిన పార్టీ శ్రేణుల సహకారం.. ఆయన కళ్ల ముందు కదిలిందేమో? శిష్య వాత్సల్యం ముంచుకొచ్చింది. తాను ప్రస్తుతమున్న పార్టీని, ఆ పార్టీ ప్రచారాన్ని మరచిపోయారాయన. తన శిష్యుడికి ఓట్లేయాల్సిందిగా ఆ సామాజికవర్గం వారిని కోరివచ్చారట. కేవలం తన శిష్యుడైనంత మాత్రానికే, డిపాజిట్టు కూడా దక్కుతుందో లేదో తెలియని పార్టీ అభ్యర్థికి ఓట్లేయమని అడిగి వచ్చిన పెద్దాయన శిష్యవాత్సల్యం ఇప్పుడు శాంతిపురం మండలంలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుత పార్టీ పెద్దలకు ఈ విషయం తెలిస్తే రాజకీయ మనుగడకు ప్రమాదమని తెలిసినా గురువుగా ఆయన చూపించిన తెగువకు శిష్యగణం కళ్లు చెమరుస్తున్నాయి. 'అదీ.. గురువంటే అలా ఉండాలి' అంటూ వాళ్లు ఆనందబాష్పాలను కారుస్తున్నారట.

- కుప్పం

చెడిపోయిన రాజకీయ వ్యవస్థలోకి విశ్వసనీయత, నిజాయతీ అనే పదాలు రావాలి. ఏ రాజకీయ నాయకుడైనా ఒక పని చేస్తానని చెప్పి చేయకపోతే.. తన పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లిపోయే పరిస్థితి తేవాలి. మోసం చేసేవాడు.. అబద్ధాలు చెప్పేవాడు.. మీకు నాయకుడిగా కావాలా..? ఆలోచించుకోండి.

- ఆరేళ్ల కిందట జిల్లాలో పాదయాత్ర చేస్తూ జగన్ చెప్పిన మాటలు ఇవి.

ప్రతిపక్ష నేతగా.. అధికారంలోకి రాగానే చిత్తూరు డెయిరీని పునరుద్ధరిస్తాం. ఆ డెయిరీకి పాలు పోసే రైతులకు లీటరుకు రూ.4 చొప్పున రాయితీ ఇస్తామని చెబుతున్నా. జిల్లాలోని షుగర్ ఫ్యాక్టరీలను పునరుద్ధరించి చెరకు రైతుల కష్టాలు తీరుస్తా.

- 2018 జనవరిలో పాదయాత్ర సందర్భంగా జగన్ చెప్పిన మాటలివి.

ముఖ్యమంత్రిగా.. చిత్తూరు విజయా డెయిరీని అమూల్‌కు అప్పనంగా కట్టబెట్టేసి, ఇదే పునరుద్ధరణ అంటే ఎలా? ఇక, చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ ఊసేలేదు. విపక్ష నేతగా ఇచ్చిన మాటను.. సీఎంగా నిలబెట్టుకోలేదు. నాడు మీరు వల్లించిన విశ్వసనీయత అంటే ఇదేనా?

- ఆంధ్రజ్యోతి, చిత్తూరు



ఇదేనా విశ్వసనీయత జగన్?

- విపక్ష నేతగా విలువలు, చెప్పింది చేయడంపై పెద్దపెద్ద మాటలు చెప్పారు
- సీఎంగా నెరవేర్చారా



● విజయా డెయిరీ

'అమూల్'కు కట్టబెట్టేసి
పునరుద్ధరణ అంటే ఎలా?

అధికారంలోకి రాగానే చిత్తూరు విజయా డెయిరీని పునరుద్ధరిస్తానని మాట ఇచ్చి.. అమూల్‌కు అప్పనంగా కట్టబెట్టేశారు. దీనినే పునరుద్ధరణ అంటూ సీఎం జగన్ గొప్పగా చెప్పడంపై జిల్లా పాడి రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. చిత్తూరు కలెక్టరేట్‌కు కూత వేటు దూరంలో ఉన్న ఈ డెయిరీకి చెందిన 27 ఎకరాల భూములు, ఇతర ప్రాంతాల్లోని ఆస్తుల విలువ సుమారు రూ.500 కోట్లు. ఇంత ఆస్తిని ఏడాదికి కేవలం రూ.కోటి చొప్పున ఏకంగా 99 ఏళ్ల లీజుకు అమూల్ సంస్థకు అప్పగించేశారు. ఇదే అమూల్ మాకొద్దని కర్ణాటక, తమిళనాడు సీఎంలు తెగేసి చెప్పారు. సీఎం జగన్ మాత్రం దాన్ని చంకనెత్తుకున్నారు. పైగా పాడి రైతులకు చేస్తున్న గొప్ప కార్యక్రమంగా చెప్పుకుంటున్నారు.

డెయిరీ ఉద్యోగులను పట్టించుకోని పాలకులు

అమూల్‌కు అప్పనంగా డెయిరీ ఇచ్చేసిన సీఎం జగన్ ఆ సంస్థ ఉద్యోగులను పట్టించుకోలేదు. జీతాలు రాలేదని డెయిరీ కార్మికులు(టైమ్ స్కేల్ ఉద్యోగులు) 221 రోజులుగా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తూనే ఉన్నారు. 140 మందికి రూ.63 కోట్ల బకాయిలు రావాల్సి ఉన్నా పట్టించుకునే వాళ్లే కరువయ్యారు.విజయా డెయిరీని 'అమూల్'కు కట్టబెట్టేందుకు చూపిన ఉత్సాహం..ఉద్యోగుల జీతాలపై చూపకపోవడం మానవీయమేనా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.



తీపి మాటలు.. చేదు చేతలు

చక్కెర ఫ్యాక్టరీల పునరుద్ధరణ హామీ గాలికే

చిత్తూరు, రేణిగుంట సహకార చక్కెర ఫ్యాక్టరీలను పునరుద్ధరిస్తానని హామీనిచ్చిన జగన్.. ఈ ఐదేళ్లలో పట్టించుకోలేదు. గతేడాది ఈ రెండు ఫ్యాక్టరీల ఆస్తులు, అప్పులు తేల్చడానికి లిక్విడేషన్ ప్రక్రియను ప్రారంభించారు. ఉద్యోగుల కుటుంబాలకు మాత్రం బకాయిలను చెల్లించారు. ఈ రెండు ఫ్యాక్టరీలు ఉన్నప్పుడు జిల్లాలో రైతులు 54 వేల హెక్టార్లలో చెరుకును సాగు చేసేవారు. ఇప్పుడు సాగు సగానికి సగం తగ్గింది.

చిత్తూరు ఫ్యాక్టరీ పరిస్థితి

చిత్తూరు కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీ 1964లో ప్రారంభమైంది. 2003-04 వరకు 16 వేల మంది రైతులతో ఓ వెలుగు వెలిగింది. తరువాత క్రమంగా అప్పుల ఊబిలో కూరుకుపోయింది. 2014-15లో క్రషింగ్ చేయకుండా ఆపేసింది. క్రమంగా మూతపడింది. మూతపడే సమయానికి రైతులకు బకాయిపడిన రూ.13 కోట్లను టీడీపీ ప్రభుత్వం చెల్లించేసింది. దీనిని తెరిపిస్తానని జగన్ హామీ ఇస్తే చెరకు రైతులు, సంస్థ ఉద్యోగులు సంబరపడ్డారు. ఈ అయిదేళ్లా హామీ అమలుకు సీఎం కనీస ప్రయత్నం కూడా చెయ్యకపోవడంతో మోసపోయామని రైతులు, సంస్థ ఉద్యోగులు గుర్తించారు.

ప్రైవేటు ఫ్యాక్టరీలతో రైతులకు తీవ్ర నష్టం

జిల్లాలోని ప్రైవేటు చక్కెర ఫ్యాక్టరీల యాజమాన్యం ఇష్టానుసారం పర్మిట్లు ఇవ్వడంతో ఓ రకంగా, బిల్లులు సకాలంలో అందించకపోవడంతో మరో రకంగా రైతులు నష్టపోతున్నారు. ఈ ప్రైవేటు ఫ్యాక్టరీలు కుమ్మక్కై మద్దతు ధర విషయంలో రైతులకు అన్యాయం చేసిన సందర్భాలున్నాయి. నేతమ్స్, మయూర చక్కెర కర్మాగారాలు మూడేళ్లుగా రూ.కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో, రైతులు అప్పులపాలయ్యారు. మరికొందరు అప్పులు చెల్లించలేక భూములను అమ్ముకున్నారు.

సహకార ఫ్యాక్టరీతో లాభాలు

సహకార ఫ్యాక్టరీల్లో సీనియారిటీ ప్రకారం రైతులకు పర్మిట్లు అందేవి. రైతు కూడా భాగస్వామి కావడంతో లాభాల్లో వాటా వస్తుంది. సహకార సిబ్బంది రైతుల పొలాల వద్దకు వచ్చి చెరకు పంటలో చక్కెర శాతాన్ని పరీక్షించి పర్మిట్లు మంజూరు చేసేవారు. ప్రస్తుతం ప్రైవేటు యాజమాన్యం ఇలా చేయకుండా, వెనుక పంట ముందుగా, ముందేసిన పంట ఆలస్యంగా క్రషింగుకు తీసుకుంటున్నారు. ఏళ్ల తరబడి ఎదురుచూసినా బిల్లుల ంరావడం లేదు. సహకార ఫ్యాక్టరీలు మూత పడడంతో ఇలా అన్ని విధాలుగా రైతులు నష్టపోతున్నారు.

డెయిరీ మూతకు కారణమేంటి?

తన హెరిటేజ్ కోసం నాడు చిత్తూరు డెయిరీని చంద్రబాబు మూసివేయించారని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. కానీ.. మూతపడటానికి కారణాలను పరిశీలిస్తే.. రాష్ట్రంలో 1990-2000 మధ్య అనేక సహకార డెయిరీలు మూత పడ్డాయి. దీనికి ప్రధాన కారణం 1992లో కేంద్రం మిల్క్ అండ్ మిల్క్ ప్రొడక్ట్స్ (ఎంఅండ్‌పీవో) జారీ చేసి, ప్రైవేటు డెయిరీలకు అవకాశం కల్పించింది. అప్పటికే ఆపరేషన్ ఫ్లడ్3 ద్వారా యూరప్ నుంచి వచ్చిన పాలపొడిని ఉచితంగా సరఫరా చేసింది. దీంతో పాల ధర తగ్గి, డెయిరీలు నష్టాల బారిన పడ్డాయి. చిత్తూరు డెయిరీ పాలను ఏడాదిలో ఏడు నెలలే ఏపీ డెయిరీ ఫెడరేషన్ కొనేది. మిగతా రోజుల్లో ఆవు పాల వంకతో కొనేది కాదు. ఏడాదంతా కాంట్రాక్టు ఇచ్చేది కాదు. పక్క రాష్ట్రాలకు ఎగుమతి చేసుకోవడానికి రాష్ట్ర యూనియన్ అనుమతి ఇచ్చేది కాదు. చిత్తూరు డెయిరీ రోజుకు 2.75 లక్షల లీటర్లు సేకరిస్తే 1.60 లక్షల లీటర్లే కొన్న పరిస్థితి. అప్పట్లో డెయిరీకి తిరుపతి మినహా ఇతర పట్టణాల్లో పెద్దగా మార్కెట్ లేదు. టీటీడీ కిలో నెయ్యి రూ.45 చొప్పున టెండర్లు ఇచ్చేది. కానీ కిలో నెయ్యి వ్యయం రూ.54 దాకా ఉండేది. ఈ కారణాలతో సంస్థకు 1991 నాటికే రూ.కోట్లలో నష్టం వచ్చింది. 1993లో హెరిటేజ్ పెట్టే నాటికి చిత్తూరు డెయిరీ నష్టాల్లో కూరుకుపోయింది. 1992లో ఎంపీవో (డీ లైసెన్సింగ్) ద్వారా కేంద్రం ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించింది. ఫలితంగా చిత్తూరు జిల్లాలోనే 32 మిల్క్ చిల్లింగ్ సెంటర్లు నెలకొల్పారు. ప్రస్తుతం జిల్లాలో 10 లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయి. 30 ప్రైవేటు డెయిరీలున్నాయి.

పాడి రైతులకు అన్యాయం



కోట్లాది రూపాయలు విలువచేసే విజయా డెయిరీని ప్రైవేటు సంస్థకు ఇస్తే తిరిగి రాదని అప్పుడే చెప్పాను. అమూల్ సంస్థకు 99 ఏళ్లకు లీజుకు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఒంటరి పోరాటాలు చేశాను. మంత్రులను సభల్లో ప్రశ్నించాను. సీఎం జగన్ చిత్తూరుకు వచ్చినప్పుడు నిరసన తెలుపుతానని తెలిసి పోలీసులు నన్ను హౌస్ అరెస్టు చేశారు. అమూల్ సంస్థకు డెయిరీని అప్పగించడం పాడి రైతులకు అన్యాయం చేయడమే.

- ఈదల వెంకటాచలం నాయుడు, ఉద్యమకారుడు, జిల్లా పాడి రైతుల సంఘం

ప్రైవేటు సంస్థలకు ఇవ్వడం సరికాదు



విజయా డెయిరీని అమూల్ ప్రైవేటు సంస్థకు అప్పగించడం సరికాదు. దీని వల్ల రైతులకు బాగా నష్టం కలుగుతుంది. డెయిరీని కోఆపరేటివ్ సొసైటీకి అప్పగించి ఉంటే రైతులకు కొంత ప్రయోజనం ఉండేది. ప్రభుత్వ యాజమాన్యంలో గిట్టుబాటు ధర ఉండేది. ఇప్పుడు ప్రైవేటు సంస్థ నిర్ణయించినదే పాల ధర. దీని ద్వారా రైతులకు నష్టం తప్ప, లాభం ఉండదు.

- ఎ.రాధిక, పాడి రైతు, చిత్తూరు రూరల్

మా బతుకులు రోడ్డున పడ్డాయి



డెయిరీలోని 140 మంది వర్కర్లకు రూ.63 కోట్లు బకాయిలు ఇంత వరకు రాలేదు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. మా బతుకులు రోడ్డున పడుతున్నాయి. 220 రోజులకు పైగా డెయిరీ ముందు దీక్ష చేస్తున్నా, ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కోట్ల రూపాయలు విలువైన ప్రభుత్వ ఆస్తిని అతి తక్కువ ధరకు విజయా డెయిరీని ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు అప్పగించింది.

- పీడీ కుమార్, టైంస్కేల్ వర్కర్, విజయా డెయిరీ

కుప్పం వర్తమానం

ఒకరు మాజీ సర్పంచి. మరొకరు ప్రస్తుత సర్పంచి భార్య. ఇద్దరికీ అధికార పార్టీలో అవమానాలే ఎదురయ్యాయి. చేసిన కష్టానికి తగిన గుర్తింపు దక్కలేదని ఒకరు, సొంత పార్టీ నాయకుల భూ కబ్జాలు, దందాలు భరించలేక మరొకరు.. రెబల్ అభ్యర్థులుగా నిలిచారు. ఒకరు వైసీపీ అభ్యర్థిగానే నామినేషన్ వేస్తే మరొకరు స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసి వైసీపీ ప్రకటిత అభ్యర్థి, ఎమ్మెల్సీ భరత్‌ను సవాల్ చేస్తున్నారు.

- కుప్పం

వైసీపీకి రెబల్స్ దెబ్బ!

● ఎదురు తిరిగిన ఆ ఇద్దరూ





ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న నీలావతి - వసనాడు మురళి

ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ కుప్పం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అంతకంతకూ పుంజుకుంటోంది. గ్రామగ్రామానా ఆ పార్టీకి ప్రజల మద్దతు పెరుగుతోంది. పార్టీ తలపెడుతున్న ప్రచారాలు, కార్యక్రమాలకు జనం వెల్లువెత్తుతున్నారు. ఈనెల 19న చంద్రబాబు తరఫున నామినేషన్ వేసిన ఆయన సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్న ర్యాలీకి స్వచ్ఛందంగా తరలి వచ్చిన వేలాదిమంది జనమే దీనికి నిదర్శనం. దీనికి రివర్స్‌లో వైసీపీ పరిస్థితి నియోజకవర్గంలో నానాటికీ దిగజారుతోంది. ఎక్కడికక్కడ పార్టీ, విభేదాలతో కునారిల్లుతోంది. గోరుచుట్టుమీద రోకలిపోటులా ఇప్పుడు ఆ పార్టీ ప్రకటిత అభ్యర్థి భరత్‌కు ఇద్దరు రెబల్ అభ్యర్థులు తయారయ్యారు. కుప్పం మండలం వసనాడు వైసీపీ మాజీ సర్పంచి బి.మురళీధర్ అలియాస్ వసనాడు మురళి సోమవారం ఆ పార్టీ అభ్యర్థిగానే పేర్కొంటూ నామినేషన్ వేస్తే, శాంతిపురం మండలం మొరసనపల్లె వైసీపీ సర్పంచి అభ్యర్థి జగదీశ్ భార్య నీలమ్మ అలియాస్ నీలావతి మంగళవారం స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ఇద్దరూ ఎటువంటి హంగామా, అట్టహాసం లేకుండా ఒకరిద్దరు మనుషులతో వచ్చి నామినేషన్ వేసేసి వెళ్లారు.

పార్టీ నాయకుల తీరుపై తీవ్ర నిరసన

ఐదేళ్ల వైసీపీ పాలనలో కుప్పం నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధికీ నోచులేకపోయింది. కుప్పం పట్టణంలో అక్కడక్కడా సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించడం తప్ప పంచాయతీల్లో అభివృద్ధి అనేదే కనిపించకపోవడంపై ప్రజల్లో ఔఅసంతృప్తి ఉంది. ఇక, వైసీపీ నాయకుల ఇసుక.. భూదందాలు, క్వారీ అక్రమాలు ప్రజలను చీకాకుపెట్టాయి. దాడులు, దౌర్జన్యాలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించాయి. ఇప్పుడు ఇవే మాటలు వైసీపీ రెబల్ అభ్యర్థులు కూడా చెబుతున్నారు. పార్టీకోసం దీర్ఘకాలంగా కష్టపడినా గుర్తింపు లభించకపోగా, పైస్థాయిలోనే అక్రమాలు, దౌర్జన్యాలు తమను బాధించాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం తమ పంచాయతీలకు, అక్కడి ప్రజలకు ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేకపోయామంటున్నారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, ప్రస్తుత అభ్యర్థి అయిన భరత్‌పైనే వారు విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతున్నారు. నామినేషన్‌వేసి వచ్చాక వైసీపీ నేతల దందాలు, భూ కబ్జాలపై నీలావతి గళం విప్పారు. వైసీపీ నాయకుల దౌర్జన్యాలకు అమాయక ప్రజలు బలైపోతున్నారని ధ్వజమెత్తారు. వారి ఆగడాల నుంచి రక్షణ కావాలంటే తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు.

అంతర్గత విభేదాలూ ఎక్కువే


పేరుకు నామినేషన్ వేసిన రెబల్ అభ్యర్థులు ఇద్దరే అయినా, పార్టీలో అంతర్గతంగా ఉన్న నిరసనలు, విభేదాలు చాలా ఎక్కువే. పార్టీ నాయకుల దౌర్జన్యాలను సహించలేక, వారి నిరాదరణకు గురైన పలువురు కిందిస్థాయి నాయకులు, కార్యకర్తలు ఈ ఇద్దరు రెబల్స్ ధైర్యాన్ని మెచ్చుకుంటున్నారు. రాబోయే రోజుల్లో వైసీపీలో మరింత నిరసన సెగ తగలక తప్పదని అటువంటివారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

- కుప్పం

● నోట్ దిస్ పాయింట్

అత్యధిక ఓటర్లున్న నియోజకవర్గం
పలమనేరు..
2,66,935 మంది ఓటర్లు
అత్యల్పం: చిత్తూరు..
2,00,822 మంది

పోలింగ్ కేంద్రాలు: 1771
పలమనేరు: 288 (అత్యధికం)
చిత్తూరు: 226 (అత్యల్పం)
సమస్యాత్మకం
పుంగనూరు: 100 (అత్యధికం)
గంగాధరనెల్లూరు: 34 (అత్యల్పం)



- చిత్తూరు కలెక్టరేట్

59 మంది వలంటీర్ల రాజీనామా

పూతలపట్టు : మండల పరిధిలోని 59 మంది వలంటీర్లు మంగళవారం తమ పదవులకు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తూ తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో ప్రసన్నకుమారికి అందజేశారు.

కార్యకర్తలే టీడీపీకి బలం : భాను


టీడీపీ కార్యకర్తల సమావేశంలో ప్రసంగిస్తున్న భానుప్రకాష్

నగరి, ఏప్రిల్ 23: కార్యకర్తలే టీడీపీకి బలమని గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మంగళవారం టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరిలో మరమగ్గ కార్మికులు టీడీపీ హయాంలో సుభిక్షంగా వుండేవారని, నాడు మానాన్న ముద్దుకృష్ణమనాయుడు చంద్రబాబుతో మాట్లాడి వారికి పలు రకాల సబ్సిడీలను అందేలా చూశారన్నారు. పన్నులు, విద్యుత్‌చార్జీలు తక్కువగా వుండేవని, నేడు భారీగా పెంచడంతో మరమగ్గాలను పాతసామానుల అంగడికి వేసి కూలీకి వెళ్లే పరిస్థితిని వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. ఎన్నికలలో ప్రతి ఓటు విలువైందేనని, ఏఒక్క ఓటును వదులుకోకుండా చివరి వరకు కష్టపడితే విజయం తథ్యమన్నారు. కార్యక్రమంలో నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్‌బాబు, కార్యదర్శి శ్రీనివాసన్, నాయకులు గుణశేఖర్, కృష్ణారెడ్డి,శ్రీధర్, బాబురెడ్డి శ్రీనివాసులు భీమా, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒక్కచాన్స్ అంటూ జగన్ మోసం : గాలి భాను

నింద్ర : ఒక్కచాన్స్ అంటూ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన జగన్‌కు ఓటమి ఖరారైందని గాలి భానుప్రకాష్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మండలంలోని శ్రీరామపురం, ఐఆర్ కండ్రిగ, ఎంఎస్‌బీఎం పురం, మేళంబాం, కొత్త ఆరూరులో ప్రచారం నిర్వహించారు. అనంతరం విలే కరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతి, అరాచకం తప్ప అభివృద్ధి జరగలేదన్నారు.

జీడీ నెల్లూరులో టీడీపీ అభ్యర్థి నామినేషన్


నామినేషన్ అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి థామస్

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 23: గంగాధరనెల్లూరులో టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాద్‌రావు, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీ.కే.బాబుతో కలిసి ర్యాలీగా వచ్చి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సమీపంలో ట్రాఫిక్ జామ్ అవడంతో టీడీపీ నాయకులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అలాగే కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కార్వేటినగరం మండలం పాదిరికుప్పం దళితవాడకు చెందిన డి.రమేష్‌బాబు, సమాజ్‌వాది పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా వెదురుకుప్పం మండలం నెమలగుంట దళితవాడకు చెందిన పళ్ళిపట్టు గుణశేఖర్ నామినేషన్లు అందజేశారు. టీడీపీ నేతలు సీఆర్ రాజన్, భీమినేని చిట్టిబాబు నాయుడు, శ్రీధర్ యాదవ్, కోదండయాదవ్, స్వామిదాస్, దేవపత్ని ధనంజయ నాయుడు, పాచికుంట రఘునాథ నాయుడు, వెంకటేష్, దేవసుందరం, కామసాని కోదండ రెడ్డి, కేతినేని లోకేష్ నాయుడు, నియాజ్ అలీ, జ్యోతి యాదవ్, జనసేన నేతలు పొన్న యుగంధర్, జైపాల్ రాజు, డీఎస్ సురేష్, రాఘవ, శోభనబాబు, సురేష్ రెడ్డి, కిరణ్, భానుచంద్ర, బీజేపీ నేతలు మణివర్మ, డీక చౌదరి, ఇడగట్టి సుధాకర్, రాజేంద్రన్, అరుణ, మురళి, సుందర్‌రాజ్, నారాయణ ఆచారి, వేణుగోపాలాచారి తదితరులు పాల్గొన్నారు.

ఎద్దుల బండిపై వెళ్లి రాకేష్‌రెడ్డి నామినేషన్


నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి రాకేష్‌రెడ్డి

నగరి, ఏప్రిల్ 23: నగరి కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోచారం రాకేష్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం 12.27 నిమిషాలకు నామినేషన్ దాఖలు చేశారు. అంతకముందు పట్టణ పరిధిలోని కొత్తపేటలో గల అగర వినాయకస్వామి ఆలయంలో పూజలు చేసి ఎద్దులబండిపై ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రంలోను పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు రాకేష్‌రెడ్డి పేర్కొన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల నాయకత్వంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, డీఎంకే, వీసీకే పార్టీల నాయకులతో కలిసి రాకేష్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు.

కాంగ్రెస్ నామినేషన్‌కు తరలిన కార్యకర్తలు

విజయపురం : నగరిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాకేష్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి మండలం నుంచి కార్యకర్తలు ట్రాక్టర్లు, కార్లు, ద్విచక్ర వాహనాల్లో తరలి వెళ్లారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రాజు, నాయకులు రత్నం తదితరులు పాల్గొన్నారు.

గాలి భానుప్రకాష్ తరపున నామినేషన్ దాఖలు

పుత్తూరు అర్బన్ : టీడీపీ నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్‌కి మద్దతుగా ఆ పార్టీ రూరల్ క్లస్టర్ ఇన్‌చార్జి గంజి మాధవయ్య మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ రూరల్ అధ్యక్షుడు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, అడ్వకేట్ శేషాచలం పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులపై ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి


సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

గుడిపాల, ఏప్రిల్ 23: మండలంలో చేతిపంపు బోర్లు ఎన్ని ఉన్నాయి, ఎన్ని మరమ్మతులు చేపట్టారని సభ్యులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తాగునీరు, వైద్యంపై చర్చించారు. గుడిపాల ఎంపీటీసీ గోళ్లహరిప్రసాద్ చౌదరి, పానాటూరు ఎంపీటీసీ మొగిలిరెడ్డి, 197 రామాపురం సర్పంచ్ జనార్ధన్‌లు మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు అధికంగా ఉన్నాయని, రానున్న రోజుల్లో మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందన్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు. రామాపురంలో బోరు వేసి వదిలేశారని, వాటికి మోటారు, పైపులను అమర్చాలని కోరారు. అనంతరం ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరిగిన దృష్ట్యా వడదెబ్బపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీకి చెక్

జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్


మాట్లాడుతున్న జిల్లా టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 23: అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్‌తో టీబీ వ్యాధికి చెక్ పెట్టవచ్చునని జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్ అన్నారు. మంగళవారం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని ఎంసీహెచ్ సమావేశ మందిరంలో మెడికల్ ఆఫీసర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ 18 సంవత్సరాలు పైబడిన, షుగర్ వ్యాధిగ్రస్తులు వేయించుకోవాలన్నారు. బాడీ మాస్ ఇండెక్స్ 18 కేజీల కన్నా తక్కువ బరువు ఉన్న వారు తప్పనిసరిగా వ్యాక్సిన్ వేయించుకోవాలని సచించారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, గుండెజబ్బువారు, డయాలసిస్, క్యాన్సర్ రోగులు, 3నెలల ముందు రక్తదానం చేసిన వారు, టీబీ చికిత్స తీసుకుంటున్న వారు ఈ వ్యాక్సిన్ వేయించుకోకూడదన్నారు. ఇంటింటి సర్వే చేసి అర్హులందరికీ బీసీజీ వ్యాక్సిన్ వేయించాలని వైద్యాధికారులను ఆదేశించారు.

'చిత్తూరును అభివృద్ధి చేసుకుందాం' కరపత్రాల ఆవిష్కరణ


గురజాల జగన్మోహన్‌తో సీఐటీయూసీ నేతలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 23: ఉద్యోగులు, కార్మికులు, కర్షకులను సీఎం జగన్ వంచించారని సీఈయూసీ అధ్యక్షుడు డీబీ రాజేంద్ర ఆరోపించారు. మంగళవారం బీవీ రెడ్డి కాలనీలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నివాసంలో ఆయనను కలిసి 'చిత్తూరును అభివృద్ధి చేసుకుందాం' పేరిట ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం రాజేంద్ర మాట్లాడుతూ ఐదేళ్ళ వైసీపీ పాలనలో భూకబ్జాలు, రౌడీయిజం, ఇసుక, గ్రానైట్ అక్రమ రవాణా వ్యాపారాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, నేతలు కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఉద్యోగులు, కార్మికులు, కర్షకులను వంచించిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో సీఈయూసీ నేతలు రాజా, రవీంద్రనాథ్, అబ్రహం, ఎబినైజర్, నిత్యానందం, ధనశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పౌర్ణమి పూజలు

విజయపురం, ఏప్రిల్ 23: మండలంలోని జగన్నాథపురం శ్రీరామ క్షేత్రంలో, ఆలపాకంలో కన్నిపుట్టాలమ్మ ఆలయాల్లో మంగళవారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. ఆలపాకంలో భక్తులు పాలకుండల ద్వారా నైవేద్యం సమర్పించారు. జగన్నాథపురంలో దాత శంకర్‌రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. విజయపురంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఏడవ రోజు సీతారాములస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.



కన్నిపుట్టాలమ్మకు పాలకుండలు తీసుకెళుతున్న భక్తులు, శ్రీరామ క్షేత్రంలో ఉభయదారుల పూజలు

మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తా

గురజాల జగన్మోహన్



ద్విచక్రవాహన మెకానిక్‌లతో గురజాల జగన్మోహన్ తదితరులు, ముస్లిం మైనార్టీల సమావేశంలో మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 23: ద్విచక్రవాహన మెకానిక్‌ల సమస్యలు పరిష్కరిస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ చెప్పారు. మంగళవారం గిరింపేటలోని ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో నగరంలోని ద్విచక్ర వాహన మెకానిక్‌లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టు వీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షుడు పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి జాకీర్, ఉపాధ్యక్షుడు రవి మాట్లాడుతూ తాము ఎన్నో ఏళ్ళుగా మెకానిక్ వృత్తిలో ఉన్నామని అన్నారు. వచ్చే ఆదాయం కుటుంబ పోషణ పిల్లల చదువులకు కూడా సరిపోవడం లేదన్నారు. తమకు ఇంటి స్థలాలు ఇవ్వడంతోపాటు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే నగరపాలక సంస్థ పరిధిలో దుకాణాల ఏర్పాటుకు తగిన స్థలాన్ని ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే టు వీలర్ మెకానిక్‌ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ నేతలను టువీలర్ మెకానిక్‌లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, పార్టీ రాష్ట్ర కార్య నిర్వహక కార్యదర్శి గురజాల సందీప్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, మినిలారీ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి టీడీపీ కూటమి కట్టుబడి ఉంది

ముస్లిం మైనార్టీల సంక్షేమానికి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి కట్టుబడి ఉందని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ముస్లిం మనార్టీ మోర్చా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గురజాల మాట్లాడుతూ ముస్లిం మైనార్టీలకు సముచిత స్థానం కల్పించిన ఘనత ఎన్డీయే కూటమికే దక్కుతుందన్నారు. అబ్దుల్ కలాంను రాష్ట్రపతి పదవిలో కూర్చోబెట్టింది టీడీపీ అధినేత, అప్పటి ఎన్డీఏ కూటమి అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడని చెప్పారు. ఎన్డీయే కూటమిలో మైనార్టీలకు పెద్ద పీట వేశారని పేర్కొన్నారు. మైనార్టీలు కూటమికి దగ్గరవుతుండడాన్ని వైసీపీ నేతలు జీర్ణించుకోలేక ప్రలోభాలకు తెరలేపారని, మతకల్లోలాలు సృష్టించేలా రెచ్చగొడుతున్నారని చెప్పారు. మైనార్టీలు ప్రలోభాలకు లొంగకుండా కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి అట్లూరి శ్రీనివాసులు, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యుడు షంషీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి మస్తాన్, జిల్లా అసెంబ్లీ ఇన్చార్జ్ మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్

టీడీపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నేడు నామినేషన్ వేయనున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు స్థానిక దర్గాసర్కిల్ నుంచి భారీ ర్యాలీగా గిరింపేట, దుర్గమ్మ గుడి మీదుగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ వేయనున్నారు. నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా హాజరు కానున్నారు.

అర్ధగిరిలో సుదర్శన హోమం



తవణంపల్లె, ఏప్రిల్ 23: ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. అలాగే సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరణ గావించి ప్రాకారోత్సవం నిర్వహించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం నిర్వహించారు.

కోదండ రామాలయంలో పూజలు



కార్వేటినగరం, ఏప్రిల్ 23: కార్వేటి నగరం బొందు వీధిలో వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం అభిషేక పూజోత్సవాలు, స్వపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులు పాల్గొని శ్రీరామ నవమి ఉత్సవాలను తిలకించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శేష వాహనంపై పార్వతీపరమేశ్వర్లు



పెనుమూరు, ఏప్రిల్ 24: మండలంలోని పులిగుండు శివాలయంలో వెలసిన పార్వతీపరమేశ్వరుల ఆలయంలో పౌర్ణమి వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. అర్చకులు ఉదయం స్వామి, అమ్మవార్లకు పుష్పాలంకరణ చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని శేషవాహనంపై అలంకరించి కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్. అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణలో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి భక్తులకు అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నగరిలో టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ నాయకులు



నగరి, ఏప్రిల్23: పట్టణ పరిధిలో వైసీపీకి చెందిన నాయకులు నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ చేతుల మీదుగా మంగళవారం టీడీపీ కండువా కప్పుకున్నారు. వైసీపీ నాయకులు ఎస్‌వీ భాస్కర్ (భీమా), జగన్, లోక, కార్తీక్, మూర్తి, పక్రుద్దీన్, జయకుమార్, తులసి, హేమాద్రి, ఢిల్లీ, సతీష్‌లు మంగళవారం టీడీపీలో చేరారు. నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ పనితీరు, చంద్రబాబు సిద్ధాంతాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 60 కుటుంబాలు



వడమాలపేట, ఏప్రిల్ 23: వడమాలపేట మండలం వేమాపురంలో సుమారు 60 కుటుంబాలు మంగళవారం టీడీపీలో చేరాయి. వైసీపీ యూత్ నాయకులు సోమశేఖర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే తిరుమణ్యంలో దీపురెడ్డి, వెంకటరెడ్డి తమ అనుచరులుతో టీడీపీలో చేరారు. యూత్ నాయకులు కార్తీక్, యుగంధర్, ప్రకాష్, భూపతి, సోము, మధు, పురందర్, మణికంఠ, దేశయ్య, దేవరాజులు, వెంకటపతి, సురేష్ రవి చేరారు.

ఎన్డీయే కూటమితోనే ప్రజా సంక్షేమం సాధ్యం


టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో రాధేయ్

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 23: ఎన్డీయే కూటమితోనే ప్రజా సంక్షేమం సాధ్యమని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావు తనయుడు రాధేయ్ అన్నారు. మంగళవారం బీవీ రెడ్డి కాలనీలోని ఎంపీ కార్యాలయంలో టీడీపీ, బీజేపీ, జనసేన నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాధేయ్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేయాలని కోరారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పేర్కొన్నారు. రానున్న ఎన్నిల్లో ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ళ ప్రసాదరావులను అత్యధిక మెజారిటీతో గెలిపించుకునేందుకు అందరూ సమిష్టిగా కృషిచేయాలని కోరారు.

కిసాన్ మోర్చా రాష్ట్ర చెరుకు రైతుల కన్వీనర్‌గా ఆదినారాయణ రెడ్డి



నింద్ర, ఏప్రిల్ 23: బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర చెరుకు రైతు విభాగ కన్వీనర్‌గా నేతమ్స్ షుగర్స్ కర్మాగారం చెరుకు రైతు సంఘ అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరుకు రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పేదలకు అన్నదానం



బంగారుపాళ్యం, ఏప్రిల్ 23: చీకూరుపల్లికి చెందిన జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు కిషోర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మండలంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద మంగళవారం భోజనం వితరణ చేశారు.

టెన్త్ టాపర్‌కు సన్మానం



బంగారుపాళ్యం, ఏప్రిల్ 23: పెరుమాళ్ళపల్లికి చెందిన విద్యార్థిని ధరణి పలమనేరు వద్ద వున్న శంకరాయలపేట గురుకుల పాఠశాలలో చదువుతోంది. సోమవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 580 మార్కులు సాధించింది. తల్లి ప్రభావతి దినసరి కూలీ, తండ్రి ప్రతాప్ గౌడ్ లారీ డ్రైవర్. కాగా మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ విద్యార్థిని ధరణిని మంగళవారం సన్మానించారు. ఉన్నత చదువులకు ఆర్థికసాయం చేస్తానని హామీయిచ్చారు.

అడవి పందుల వేటగాళ్ల అరెస్టు



చిత్తూరు (సెంట్రల్), ఏప్రిల్ 23: అడవి పందులను వేటాడిన ఇద్దరు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు మంగళవారం అరెస్టు చేశారు. చిత్తూరు తూర్పు రేంజ్ అటవీ అధికారి థామస్ వెల్లడించిన వివరాలు ఇలా ... బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంటకు చెందిన కె.మణికంఠ, ఎస్.మురేగేషన్‌లు అడవి పందులను వేటాడి, ద్విచక్రవాహనంలో తీసుకువస్తుండగా, రాసనపల్లి వద్ద అదుపులో తీసుకున్నామని తెలిపారు. వీరి నుంచి బజాజ్ వి5 ద్విచక్రవాహనం సీజ్ చేయడంతోపాటు వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. అడవి జంతువులను చంపడం, వాటిని రవాణా చేయడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడిన వ్యక్తులపై అటవీ సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. ఫారెస్టు బీట్ అధికారి మధు, గౌస్‌బాషా,సిబ్బంది పాల్గొన్నారు.

పాళ్యంలో హనుమాన్ జయంతి



గుడిపాల, ఏప్రిల్ 23: మండలంలోని నారగల్లు పంచాయతీ పాళ్యంకొండ లో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి పాదాలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. అలాగే 197 రామాపురంలో వెలసిన వీరబ్రహ్మంగారి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవం నిర్వహించారు. భక్తులకు కుంకుమ, పసుపుదారాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాళ్యంకొండ నిర్వాహకులు తారకరామ్, గుర్రప్ప నాయుడు, మోహన్ నాయుడు, నీలకంఠనాయుడు, చిట్టిబాబు, ఢిల్లీబాబు, రాజు, రామాపురం ధర్మకర్త బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.